RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 329 మంగళవారం 23 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

బెంగళూరు : జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలపు నర్విభజన చేస్తే, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం వాటిల్లుతుందని, లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం తగ్గుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. డీలి మిటేషన్‌తో ఉత్తరాది రాష్ట్రాల్లో 30శాతం సీట్లు పెరిగే అవకాశం ఉందని నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ముఖ్యులంతా సమైక్యంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సహకార సమాఖ్యవాదం గురించి మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రజలకు అవసరమైన పనులకోసం గ్రాంట్లలో ఎందు కు కోత పెడుతోందని నిలదీశారు. కర్ణాటకలో సహకార బ్యాంకుల కు నాబార్డు నిధుల్లో 58శాతం కోత విధించిందని, తద్వారా లక్షలాది రైతులకు ఈ ఏడాది పంటరుణాలు అందలేదని చెప్పారు.



## జనవరి 2 నుంచి అసెంబ్లీలో చర్చిద్దాం.. రండి
## కేసీఆర్ కు రేవంత్ సవాల్

# అసత్యాల కేసీఆర్!

## ఆనాడు సంతకం పెట్టి.. ఈనాడు నీతులు చెబుతారా?

## కేసీఆర్‌కు గట్టిగానే ఇచ్చిపడేసిన రేవంత్, ఉత్తమ్, కాంగ్రెస్ నేతలు!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లలో కేసీఆర్ సర్వనాశనం చేశారని.. ఆయనొక ఆర్థిక ఉగ్రవాది అని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. "తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పాలమూరు జిల్లాకే అన్యాయం చేసిన జలద్రోహి కేసీఆర్. రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని నడిబజారులో నిలబెట్టి దివాలా తీయించిండు. భూకంపం వచ్చి వెళ్లాక మిగిలిన శిథిలాల మాదిరిగా రాష్ట్రాన్ని మార్చితే.. మేం ఇప్పుడు ఆ శిథిలాలను తొలగిస్తూ రాష్ట్రాన్ని దారిలో పెడుతున్నాం' అని ఆయన తెలిపారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిన్న రాత్రి కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డిపై ఓ రేంజ్ లో ఉదాహరణలతో సహా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే కేసీఆర్ వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ను కడిగేసిన కేసీఆర్ పై కౌంటర్ కూడా గట్టిగానే ప్రతిస్పందన వచ్చింది. తాజాగా కేసీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. కేసీఆర్ వైఖరిని 'ఆర్థిక ఉగ్రవాదం'గా అభివర్ణిస్తూ .. ఆయన కుటంబ రాజకీయాలపై రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యల చేశారు.

**పార్టీ వారసత్వ పోరు అంటూ రేవంత్ కౌంటర్...** సీఎం రేవంత్ రెడ్డి తాజాగా కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ బయటకు రావడం వెనక రాష్ట్ర ప్రయోజనాల కంటే కుటుంబ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తన అల్లుడు హరీష్ రావు చేతుల్లోకి పార్టీ వెళుతుందనే భయంతోనే తన కుమారుడు కేటీఆర్ రాజకీయ భవిష్యత్తును కాపాడడానికి కేసీఆర్ బయటకు వచ్చారని రేవంత్ విమర్శించారు. కేసీఆర్ చావాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని.. ఆయన ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షిస్తున్నానని సీఎం స్పష్టం చేశారు. కేసీఆర్ కు బయటి వ్యక్తుల కంటే ఆయన కుటుంబ సభ్యుల నుంచే ముప్పు ఉందని..కుర్చీ కోసం కొడుకు, అల్లుడు ఆయన చావును కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ను కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ కలిసి నిర్బంధించారని రేవంత్ ఆరోపించారు.

**ఆర్థిక, రాజకీయ అంశాలపై ధ్వజం..** రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఆర్థికంగా అత్యాచారం చేసిందని.. కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అని రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఎన్ని ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరులో మార్పు లేదని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ తమలపాకుతో కొడితే.. నేను తలుపు చెక్కతో కొట్టే రకం' అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని.. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని రేవంత్ సవాల్ విసిరారు. అధికారంపై ఉన్న వ్యామోహం ప్రజలపై లేదని అందుకే ఆయన అసెంబ్లీకి రావడం లేదని పేర్కొన్నారు.

**కేసీఆర్ మాటల్లో 90 శాతం అబద్ధాలే : మంత్రి ఉత్తమ్...** నీటి పారుదల అంశాలపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పదేళ్ల అధికారంలో దేవాదుల , ఎస్.ఎల్.బీసీ , దిండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు అందించారా? అని నిలదీశారు. 1.80 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఉత్తమ్ మండిపడ్డారు. ఉద్యమాలు చేసేముందు ,రాష్ట్రాన్ని నాశనం చేసినందుకు కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టింది గత ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నీటి పారుదల రంగాన్ని అస్తవ్యస్థం చేసిన కేసీఆర్ ఇప్పుడు కేవలం తన వారసుల రాజకీయాల కోసమే బయటకు వచ్చి అబద్దాలు చెబుతున్నారని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా విమర్శించారు. మొత్తంగా కేసీఆర్ కౌంటర్ కు, ఉత్తమ్, రేవంత్ రీకౌంటర్ తో ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వార్ యమ రంజుగా సాగుతోంది.



## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

### ఢిల్లీకి పయనమైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము - గవర్నర్, సీఎం వీడ్కోలు

హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ శీతాకాల విడిది ముగిసింది. ఈ నెల 17న హైదరాబాద్ చేరుకున్న ఆమె.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి.. తాజాగా ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయనమయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర కిషన్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.



## జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనపై జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్‌డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆ నివేదికను బయటపెట్టలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది బుధవారమే కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటివరకు అందిన 3,100 అభ్యంతరాలు పరిష్కరిస్తున్నామన్నారు.




## కమీషన్ల కోసమే కాళేశ్వరం.. రూ.లక్షల కోట్ల అప్పు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీలే. రూ. 1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అనేది పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా? కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ. లక్షల కోట్లు అప్పులు చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ. 16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ. 5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారు" అని ఉత్తమ్ విమర్శించారు.

**కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎలా ఆడాలో సీఎం రేవంత్‌కు తెలుసు: మంత్రి సీతక్క...** బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎప్పుడో బీఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రపంచ ఆటగాడితోనే ఫుట్‌బాల్ ఆడినట్లు తెలిపారు. కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎట్లా ఆడాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసన్నారు. అధికారం పోయిందని అక్కసుతో హరీష్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీష్ రావుకు మించి తప్పుడు కూతలు, తప్పుడు మాటలు, గ్లోబల్ ప్రచారం ఎవరు చేయరని విమర్శించారు. అధికారం పోయాక ఎవరో వాళ్ళ ఇంట్లో పడి గుంజుకున్నట్టుగా ఫీలై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు.

ప్రజలు బీఆర్ఎస్‌కు 10 సంవత్సరాలు అవకాశం ఇచ్చారని.. సరిగా పని చేయకపోతే ప్రజలు అధికారం నుంచి దింపేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మంచిగా పని చేయనప్పుడు కాంగ్రెస్‌ను కూడా దించుతారని అన్నారు. కవితకు జవాబు చెప్పలేక కాంగ్రెస్ పార్టీ మీద పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలతో తాము పాజిటివ్ దృక్పథంతో ఉంటామని స్పష్టం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఫుట్‌బాల్ ఆడుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# మహిళలకు శుభవార్త...

## ఇకపై బస్సుల్లో ఆధార్‌కార్డు అవసరమే లేదు!



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది.

ఉచిత బస్సు ప్రయాణాన్ని మ రింత సులభతరం చేస్తూ 'మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల' పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనివల్ల ఇకపై ఆధార్ కార్డులు చూపించి, జీరో టికెట్లు తీసుకోవాల్సిన శ్రమ తప్పుతుంది.

**స్మార్ట్ కార్డుల అవసరం ఏంటి?...** ప్రస్తుతం మహిళలు ఆధార్ కార్డు చూపించి కండక్టర్ వద్ద నుండి జీరో టికెట్ పొందుతున్నారు. అయితే ఈ ప్రక్రియలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆధార్ కార్డుల్లో పాత ఫోటోలు ఉండటంతో కండక్టర్లకు ప్రయాణికులను గుర్తించడం కష్టమవుతోంది. గుర్తింపు విషయంలో మహిళలకు, కండక్టర్లకు మధ్య రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల గొడవలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికీ టికెట్ కొట్టడం వల్ల రద్దీ సమయంలో కండక్టర్లపై పనిభారం పెరుగుతోంది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశపెడుతోంది. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (CGG) సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

**ప్రయాణం మరింత స్మార్ట్..** త్వరలో అమల్లోకి రానున్న ఈ కొత్త విధానం ద్వారా మహిళలందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తారు. బస్సు ఎక్కినప్పుడు ఈ కార్డును చూపితే సరిపోతుంది. కండక్టర్ వద్ద నుండి ప్రత్యేకంగా జీరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కేవలం కార్డు ట్యాప్ చేయడం లేదా చూపించడం ద్వారా ప్రయాణం సాఫీగా సాగిపోతుంది.

**ఆర్టీసీకి లాభాల పంట..కొత్త బస్సుల రాక!...** ఆదివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను వెల్లడించారు. మహాలక్ష్మి పథకం అమలు వల్ల ఆర్టీసీకి రూ. 255 కోట్ల లాభం చేకూరిందని వారు తెలిపారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్‌కు 2,800, వరంగల్‌కు 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలోనే తీసుకురానున్నారు. అర్హులైన మహిళలందరికీ వీలైనంత త్వరగా ఈ స్మార్ట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఎలా పొందాలి?...** ఈ కార్డుల పంపిణీ ప్రక్రియ, దరఖాస్తు విధానంపై ప్రభుత్వం త్వరలోనే అధికారిక మార్గదర్శకాలను విడుదల చేయనుంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాలు లేదా ఆన్‌లైన్ ద్వారా వీటిని పొందే అవకాశం కల్పించనున్నారు.

# సంపాదకీయం

## హాట్ టాపిక్... పాక్ కు రష్యా సహకారంలో నిజం ఎంత?

పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా మద్దతుగా నిలుస్తుందనే చర్చ ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పాక్ అధికారిక బ్యాచ్ మొత్తం నిత్యం అమెరికాతో సన్నిహిత సంబంధాలు నెరవేరుస్తూ.. ట్రంప్ తో రాసుకుపూసుకు తిరుగుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే... భారత్ తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న రష్యా సైతం పాకిస్థాన్ కు సహకరిస్తుందనే కథనాలు ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారాయి. అవును... భారత్ కు రష్యా అత్యంత సన్నిహిత వ్యాపార భాగస్వామిగా చెబుతారనే సంగతి తెలిసిందే. ఈ విషయాన్నే ప్రధాన కారణంగా చూపించి.. భారత్ పై అమెరికా పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. రష్యాతో భారత్ వ్యాపారం ఉక్రెయిన్ తో యుద్ధానికి పరోక్ష మద్దతు అనే కామెంట్లూ చేసింది. ఈ సమయంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలకు రష్యా ఇంజిన్లు సరఫరా చేస్తుందనే వార్తలు ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ గా మారాయి. వివరాల్లోకి వెళ్తే... పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలను మాస్కో కొట్టిపారేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ తో తమకు అటువంటి ఒప్పందం ఏమీ జరగలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో... భారత్ తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఈ తరహా ప్రచారాలు చేయడం సరికాదన్నాయి. అదేవిధంగా... భారతదేశానికి ఇబ్బందికరంగా మారే ఎలాంటి చర్యలు తాము చేపట్టబోమని రష్యా ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తూనే ఉన్నాయని అంటున్నారు. మరో వైపు ఈ విషయం భారత్ లో మోడీ సర్కార్ పై విపక్షాల విమర్శలకు కారణమైంది. ఈ విషయంపై తాజాగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది.. బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది. ఇందులో భాగంగా... రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపర భాగస్వామిగా ఓ వైపు ప్రధాని మోడీ చెబుతారని.. కానీ, ఆ దేశం మాత్రం మన శత్రు దేశమైన పాకిస్థాన్ కు మద్దతునిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. ఇది ప్రధాని మోడీ వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ఇదే సమయంలో... ప్రధాని మోడీ జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని జైరాం రమేష్ దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో... అసలు పాకిస్థాన్ కు రష్యా ఎందుకు సహకారం అందిస్తుందో మోడీ ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు చెప్పే మోడీ.. దౌత్యం విషయంలో పాకిస్థాన్ ను ఇప్పటికీ ఒంటరిని చేయలేకపోతున్నారని విమర్శించారు. కాగా... పాకిస్థాన్ లో ఉన్న చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లలో వాడే ఆర్.డీ.-93ఎంఏ ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందంటూ పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అటు అంతర్జాతీయగానూ, ఇటు భారత్ లోనూ హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ విషయంపై పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు!

## ఘనంగా రామకోటి స్థూపం వార్షికోత్సవ పూజలు



శామీర్ పేట, డిసెంబర్ 22 ( గరుడ వార్త) : ప్రసిద్ధిగాంచిన దేవరయంజాల్ శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో రామకోటి స్థూపం వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. శామీర్ పేట మండలం దేవరయాంజాల్ గ్రామంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో రామకోటి స్థూపం వార్షికోత్సవ పూజలను సోమవారం ఎంతో భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఛైర్మన్ పేండం లక్ష్మినారాయణ దంపతులు, మాజీ ఛైర్మన్ దాసరి గోపాల్ రెడ్డి దంపతులు, పుర ప్రముఖులు బేజగం ఆనంద్ రావు దంపతులు, బేజగం నాగేంద్ర దంపతులు, మంచి కంటి లలిత, కందుకూరి సాయికుమార్ దంపతులు, మామిడిపల్లి మధుసూదన్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య హెూమాలు, స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టగా భక్తులందరు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, రామాలయం ధర్మకర్త ఎల్లెంకి భారతి, పూజారి రామాచార్యులు, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, స్థానికులు సముద్రాల లక్ష్మయ్య, పేండం యాదగిరి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, సముద్రాల సురేశ్, కత్తి రమేశ్, పేండం సాయి మనీష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు : మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింలు యాదవ్



శామీర్ పేట, డిసెంబర్ 22( గరుడ వార్త) : కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు లభిస్తాయని మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింలు యాదవ్ అన్నారు. సోమవారం మూడు చింతలపల్లి మున్సిపల్ నారాయణపూర్ లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యుల తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు రాణి అర్హులైన పేదలు మీ గ్రామాలలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కాగా స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేసిన పనులకు మూడు విడతల్లో, బేస్మెంట్, గోడలు, స్లాబ్ బిల్లులు రూ. 3.40 లక్షలు రావడం జరిగిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతారం మాజీ ఎంపీటీసీ అఖిలేష్, నాయకులు తూమ్ వేణుగోపాలరావు, గుర్రం బసవ రెడ్డి, పట్టా బాల నరసింహా, శ్రీకాంత్ గౌడ్, తుంకి వెంకటేశం, మహేష్, కొమురయ్య, ఎల్లయ్య, కుమార్, రత్నాల వెంకటేష్, బాల చారి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు



శామీర్ పేట, డిసెంబర్ 22( గరుడ వార్త) : గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉమ్మడి శామీర్ పేట పలు పాఠశాలల్లో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. శామీర్ పేట మండలం తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గణితంలో క్విజ్, వ్యాసరచన పోటీలు, అదేవిధంగా గణితానికి సంబంధించిన వివిధ ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారిని విజయ కుమారి విచ్చేసి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు తిరుమలేష్, నాగ శారద, అన్నపూర్ణ, శ్రీనివాస్ రెడ్డి , రజిని, వరలక్ష్మి, శ్రీదేవి, మంజుల, పద్మ, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

**దేవరయాంజాల్ లో....** ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త భారత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బాలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డి పాల్గొన్ని గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ శాస్త్రీయ విద్యాభ్యాసం లేకపోయినా స్వయంకృషితో గణిత ప్రపంచాన్ని అబ్బురపరిచిన మహా మేధావి శ్రీనివాస రామానుజన్ నని కొనియాడారు. సంఖ్యా శాస్త్రం, గణిత విశ్లేషణ, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు వంటి క్లిష్టమైన గణిత విభాగాల్లో ఆయన చేసిన కృషి అపూర్వమని తెలిపారు. అప్పటివరకు ఎవ్వరూ పరిష్కరించలేమనుకున్న సమస్యలకు సైతం రామానుజన్ సులభంగా పరిష్కారాలు కనుగొన్నారని గుర్తు చేశారు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు అప్పటి గణిత శాస్త్రవేత్తలకు సైతం అర్థం కావడం కష్టమైందని తెలిపారు. అయినప్పటికీ తన పరిశోధనలను ప్రపంచానికి తెలియజేయాలనే తపనతో ఆయన ప్రయత్నాలు కొనసాగించారని పేర్కొన్నారు. 1913లో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రముఖ గణిత శాస్త్రవేత్త జి. హెచ్. హార్డీకి ఉత్తరాల తో తన పరిశోధనలను పంపగా, అవి చూసి ముగ్ధుడైన హార్డీ రామానుజన్‌ను కేంబ్రిడ్జికి ఆహ్వానించారని వివరించారు. రామానుజన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు అత్యంత కీలకమైనవని, కొన్నైతే తాను కూడా ఎప్పుడూ చూడలేదని హార్డీ స్వయంగా పేర్కొన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. రామానుజన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలేష్, గణిత ఉపాధ్యాయుడు రమేశ్ చంద్ర, శ్రీనివాస్ రావు లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అభినందించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**శామీర్ పేట లో....** మండల కేంద్రం శామీర్ పేట పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అతివలు రయ్...రయ్

పెద్దపల్లి : పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు వాహన డ్రైవింగ్‌పైనా ఆసక్తి చూపుతున్నారు. ద్విచక్ర, కార్లు నడపడానికి వీలుగా శిక్షణ కేంద్రాల బాట పడుతున్నారు. ఇష్టంతో శిక్షణ పొంది సొంతంగా వాహనాలను రోడ్లపై పరుగు తీయిస్తూ పనులు చేసుకుంటున్నారు.

**ఏటా లైసెన్సుల పెరుగుదల**

జిల్లాలో 9 లక్షల జనాభా ఉంది. వీరిలో సగానికిపైగా మహిళలు ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు. రవాణాశాఖ నివేదిక ఆధారంగా వాహనాల లైసెన్స్‌లు తీసుకోవడంతో మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. మూడేళ్ల గణంకాలు పరిశీలిస్తే ఈ సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. జిల్లాలో సుమారు 15 శాతం లైసెన్సులు మహిళలు పొందుతున్నారు.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. ప్రతీ సమయంలో అందుబాటులో ఉండటం కొద్దిగా కష్టం. అత్యవసర పరిస్థితుల్లో ఇతరులపై ఆధారపడకుండా డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్నా. దీంతో కారులో వెళ్లి నా కొడుకును పాఠశాల నుంచి తీసుకురావచ్చు. ఈ శిక్షణతో నాలో మరింత ఆత్మ విశ్వాసం పెరిగింది. – కళావతి

## ఎన్నాళ్లకెన్నేళ్లకు.. దేవుని సేవకు..

ఖమ్మం : దేవతామూర్తులకు శాస్త్ర, సంప్రదాయ సేవలు మరింతగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక ఏళ్ల తర్వాత దేవాలయాల్లో రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తద్వారా ఎనిమిది దేవాలయాల్లోని 19 పోస్టులు భర్తీ కానున్నాయి.

**భర్తీకానున్న పోస్టులు**

దేవాలయాల్లో వేద పారాయణదారులు, అర్చకులు, పంచారిక(గర్భాలయం శుభ్రం చేసేవారు), పాచక(వంట వండేవారు), సహాయ పాచక, డోలు, సన్నాయి, శ్రుతి వాయిద్యకారుల పోస్టులను అధికారులు భర్తీ చేయనున్నారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఖమ్మం కాల్వొడ్డు శ్రీసత్యనారాయణ సహిత శ్రీవీరాంజనేయస్వామి, కూసుమంచి మండలం జీళ్లచెర్వు శ్రీవెంకటేశ్వరస్వామి, పెనుబల్లి శ్రీనీలాద్రీశ్వరస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి, అశ్వారావుపేట మండలం వినాయకపురం శ్రీచిలకలగండి ముత్యాలమ్మ తల్లి, అన్నపురెడ్డిపల్లి మండలం శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లోని 19 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధిత ఈఓలు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు.



**ఇవీ అర్హతలు..**

అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. 18 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి 20రోజుల పాటు సంబంధిత దేవాలయాల్లో ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి ఈఓలు పంపిస్తారు. దరఖాస్తులను సహాయ కమిషనర్ కార్యాలయంలో ఓ కమిటీ పరిశీలిస్తుంది. అక్కడి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేరుతాయి. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి రాత, ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. 'ఆసక్తి కలిగిన అభ్యర్థులు 20 రోజుల్లోపు సంబంధిత దేవాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఉభయ జిల్లాల్లో ఆదాయం కలిగిన ఆలయాలు 86 ఉంటే, ఎనిమిదింటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నాం' అని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి కు తెలిపారు.

## వాటా.. ఆదాయ ఊట..!

అశ్వారావుపేట : ఆయిల్‌ఫెడ్‌లో ముడిచమురు, గింజలతో పాటు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ రైతులకు వాటా ఇవ్వాలనే రైతు సంఘాల డిమాండ్‌కు నూనెగింజల సంస్థ తొలిసారి సానుకూలంగా స్పందించింది. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓఈఆర్ నిర్ణయ సమావేశంలో దీనిపై ప్రైవేటు పరిశ్రమలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినా రైతుసంఘాల ప్రతినిధులు పట్టుబట్టడంతో ఆయిల్‌ఫెడ్ స్పందించింది.

**అప్పారావుపేట పరిశ్రమలో రెండేళ్లుగా..**

ఆయిల్‌పాం గెలలను గానుగ ఆడిస్తే గింజలు వేరవుతాయి. ఖాళీగెలలు వేరుగా వస్తాయి. ఈ క్రమంలో ముడిచమురు తయారవుతుంది. గింజలను ప్రైవేటు పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. అదే గింజల నుంచి ఆయిల్(కెర్నల్) తీసే విధానాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేటలో టీజీ ఆయిల్‌ఫెడ్ రెండేళ్ల క్రితం ప్రారంభించింది. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ. 19,681 పలుకుతోంది. గానుగ ఆడగా వచ్చిన గింజల టన్ను ధర రూ. 32వేలు ఉంది. గింజల నుంచి తయారయ్యే కెర్నల్ ఆయిల్ టన్ను ధర రూ. 2.10లక్షలు పలుకుతోంది. అందుకే రైతులు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ వాటా కావాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది 29వేల టన్నుల గింజలు గానుగ ఆడగా 5వేల టన్నుల కెర్నల్ ఆయిల్ వచ్చింది. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 30వేల మంది రైతులు సుమారు 1.20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచుతున్నారు.

**కెర్నల్ ఆయిల్ వినియోగం ఇలా..**

కెర్నల్ ఆయిల్‌ను కాస్మోటిక్స్, బేకరీ పదార్థాల్లో అత్యధికంగా వాడుతుంటారు. ఆహార పరిశ్రమలు, సబ్బులు, లోషన్లు, క్రీమ్‌లు, కొన్ని రకాల ఔషధాల తయారీలో వినియోగిస్తారు. దీనిని బయోఫ్యూయల్‌గానూ వాడతారు. అందుకే కెర్నల్ ఆయిల్‌కు డిమాండ్ అధికంగా ఉంటోంది. కెర్నల్ ఆయిల్ ద్వారా పొందే రాబడిలో రైతులకు వాటా ఇవ్వాలని ఆయిల్‌పాం రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘాల ప్రతినిధులు మూడేళ్లుగా కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన ప్రధాన కార్యదర్శి, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీకి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించటంతో ఆయిల్‌పాం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సొమ్ము హవాలా.. వాటా కావాలి

హైదరాబాద్ : డ్రగ్స్.. సైబర్ మోసాలు.. జీరో వ్యాపార లావాదేవీల్లో రూ.వందల కోట్లు చేతులు మారే హవాలా దందాకు నగరంలో కొందరు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పరోక్షంగా తోడ్పాటు అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

**ష్...అంతా గప్‌చుప్**

నగరం, శివారులో 100-150 మంది కీలక హవాలా నిర్వాహకులున్నట్టు అంచనా. వీరిలో 10-15 మంది నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లకు సహకరిస్తున్నట్టు నిర్ధారించారు. డ్రగ్స్ అమ్మగా వచ్చిన సొమ్మును సేకరించి నైజీరియా, అమెరికాలో ఉన్న ప్రధాన సూత్రధారులకు చేరవేస్తున్నట్టు గుర్తించారు. కొందరు హవాలా వ్యాపారులు కేసు నుంచి బయటపడేందుకు ఒక పోలీసు అధికారి సాయంతో ప్రజాప్రతినిధిని



కలిసినట్టు సమాచారం. రూ.30 లక్షలు ఇచ్చేందుకు ప్రయత్నించినా అప్పటికే ఉన్నతాధికారి దృష్టికి వెళ్లటంతో పథకం బెడిసికొట్టినట్టు తెలిసింది. ఓ ప్రధాన వ్యాపార ప్రాంతంలో పోలీసులు హవాలా సొమ్మును గుర్తించారు. ఏజెంట్లు పోలీసులను వేడుకోవటంతో రూ.10లక్షలు తీసుకుని వదిలేసినట్టు తెలిసింది. ఇదే ప్రాంతంలోని హోల్‌సేల్ షాప్‌లోభారీగానగదు ఉన్నట్లు తెలుసుకున్న ఓ ఎస్సై దాన్ని హవాలా సొమ్మని బెదిరించి రూ.2.5 లక్షలు కాజేసినట్టు ఆరోపణలున్నాయి.

**ఏటా రూ.2-3వేల కోట్లు..**


రాజధానిలో ఏటా రూ.2-3వేల కోట్ల నల్లధనం హవాలా మార్గంలో చేతులు మారుతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి విశ్లేషించారు. దొరికే సొమ్ములో కొంతమాత్రమే లెక్కల్లో చూపుతూ ఆదాయ పన్నుశాఖకు అప్పగిస్తున్నట్టు సీపీ వీసీ సజ్జనార్ దృష్టికి వచ్చినట్టు సమాచారం. హవాలాకు సహకరిస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్లను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

## పర్యాటక విశ్వవిద్యాలయం.. ప్రతిపాదనలకే పరిమితం

హైదరాబాద్ :తెలంగాణ పర్యాటక విశ్వవిద్యాలయం ఏర్పాటులో ఏళ్ల తరబడిగా కదలిక లేదు. పర్యాటక రంగ అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పర్యాటక విధానంలో హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పటాలిటీ మేనేజ్‌మెంట్(నితం)ను పర్యాటక విశ్వవిద్యాలయంగా స్థాయి పెంచనున్నట్లు ప్రత్యేకంగా పేర్కొంది.

**మానవ వనరుల కొరత..**

రాష్ట్రంలో పర్యాటక రంగం వేగంగా పెరుగుతోంది. పర్యాటకం ద్వారా ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం రంగంలో నైపుణ్యం కలిగిన




మానవ వనరుల కొరత ఉంది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, ట్రావెల్ కంపెనీలు, ఈవెంట్‌మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ మొదలైన రంగాల్లో శిక్షణ పొందిన ఉద్యోగుల అవసరముంది. పర్యాటకంలో కోర్సులు కూడా ప్రణాళికాబద్ధంగా లేవని.. ఈ నేపథ్యంలోనే నితంను విశ్వవిద్యాలయం స్థాయికి పెంచాలని పర్యాటక శాఖ ప్రతిపాదించింది.

**ఆదరణ కోల్పోయిన సంస్థ**

నితం అనుకున్న స్థాయిలో లేకపోవడం, వివాదాస్పద నియామకాల వంటి అంశాలతో సంస్థ ప్రతిష్ఠ మసకబారింది. కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. కీలకమైన కోర్సుల్లోనూ పదిమంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒకప్పుడు నితం ఎంబీఏ సీట్లకు తీవ్రమైన పోటీ ఉండేది. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి నితంలో నెలకొంది.

## మెట్రో వంతెనలు వాడండి.. క్షేమంగా రోడ్డు దాటండి

హైదరాబాద్ :నగరంలో రహదారులు దాటుతూ నిత్యం పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.ప్రతి మెట్రో స్టేషన్‌లోని రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించుకుని సురక్షితంగా రోడ్డు దాటొచ్చు. నగరంలో 57 మెట్రోరైలు స్టేషన్లు ఉన్నాయి. కొన్ని స్టేషన్లు మినహా చాలా వాటిలో నాలుగు వైపులా ప్రవేశ మార్గాలు ఉన్నాయి. యువకులు మెట్లు వినియోగించవచ్చు. పెద్దలు, లగేజీ ఉన్నవాళ్లు, కాళ్ల నొప్పులతో బాధపడే వారు మెట్రో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఉపయోగించు




కుని రహదారి దాటొచ్చు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అవగాహన కల్పించడం ద్వారా..

మెట్రోరైలు స్టేషన్లను ఫుట్‌ఓవర్ బ్రిడ్జిగా వాడుకోవచ్చు అనే విషయం తెలియదు. నిత్యం హైదరాబాద్‌కు ఐదు లక్షల మంది వస్తుంటారు.. వెళుతుంటారు. నిత్యం రాకపోకలు సాగించేవారితో పాటు, కొత్తగా వచ్చేవారికి సైతం తెలిసేలా స్టేషన్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి.

## రాజధాని నడిబొడ్డున కొత్త అభయారణ్యం




హైదరాబాద్:రాజధాని నగరం నడిబొడ్డున కొత్త అభయారణ్యం రానుంది. సాగర్‌హైవే సమీపంలోని సాహెబ్‌నగర్-గుర్రంగూడ మధ్యలో 102 ఎకరాల అటవీ భూములపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించడం, 102 ఎకరాలు అటవీశాఖవేనంటూ గురువారం తీర్పు ప్రకటించడంతో అక్కడే ఉన్న అటవీభూముల్లో ఇవి కలిసిపోనున్నాయి. ప్రస్తుతం వీటి విలువ రూ.ఐదు వేల కోట్లపైనే ఉంది. రెండువారాల్లో వాటిని అభయారణ్యంగా ప్రకటించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులు ఒకటి, రెండు రోజుల్లో భూములకు రక్షణ కంచె నిర్మించనున్నారు.

**ఇదీ నేపథ్యం.. వివాదం** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో గుర్రంగూడ ప్రాంతంలో అటవీశాఖకు వందల ఎకరాలున్నాయి. నాగార్జున సాగర్ హైవేకు సమీపంలో రోడ్డుకు ఎడమవైపు 102 ఎకరాలు తమవేనంటూ ఇరవై ఏళ్ల క్రితం కొందరు జిల్లా కోర్టులో, అనంతరం మరో 200మంది హైకోర్టులోపిటిషన్ వేశారు. విచారణ అనంతరం 2021లో ఆ భూములు ప్రైవేటు వ్యక్తులవేనంటూ హైకోర్టు తీర్పు ప్రకటించింది. దీంతో అటవీశాఖ రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. **ఆఖరి వాయిదా.. ఫలించిన ఆలోచన** సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన అటవీశాఖ అధికారులు విచారణ కొనసాగుతున్న క్రమంలో ఆ భూమికి సంబంధించిన రికార్డులను సమర్పించారు. బలమైన సాక్ష్యాధారం సంపాదించాలని అధికారులు న్యాయవాదులతో సమాలోచనలు చేశారు. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన పత్రాలను పరిశీలిద్దామని నిర్ణయించి. కోర్టు అనుమతితో వాటిని హైదరాబాద్‌లోని రాజ్యాభిలేఖ కార్యాలయంలో సమర్పించారు. అక్కడ అవి నకిలీవిగా తేలింది. ఈ అంశాన్ని అధికారులు రుజువులతో సహా కోర్టుకు సమర్పించారు.

## స్వచ్ఛతలో మెరిసిన సర్కారు బడులు




పెద్దపల్లి : పాఠశాల స్థాయిలో పచ్చదనం, పరిశుభ్రతలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిచిన పాఠశాలలకు స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ(ఎస్‌హెచ్‌వీఆర్) పేరిట రేటింగ్ కేటాయిస్తోంది. ఉత్తమంగా నిలిచిన బడులకు అవార్డులు, నగదు పురస్కారాలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా స్వచ్ఛతలో అగ్ర పథంలో నిలిచిన పాఠశాలల జాబితా ప్రకటించింది. జిల్లా నుంచి గ్రామీణ, పట్టణ కేటగిరీ నుంచి రాష్ట్రానికి ఎనిమిది పాఠశాలను ఎంపిక చేశారు.

**307 భాగస్వామ్యం**

జిల్లావ్యాప్తంగా 307 పాఠశాలలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, మొక్కల పెంపకం, మరుగుదొడ్లు, సేంద్రీయ ఎరువుల తయారీ, పారిశుద్ధ్యం, తాగునీరు ఇలా 60 అంశాలపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పాఠశాల స్థాయిలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించారు. తర్వాత జిల్లా స్థాయిలో ఒక కమిటీ బృందం పర్యటించి ఆరా తీసి ప్రతిభా ఆధారంగా రేటింగ్ కేటాయించారు.

జిల్లాలో స్వచ్ఛతలో ఉత్తమంగా నిలిచిన పాఠశాలలను మరోసారి తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలలను రాష్ట్ర కమిటీ బృందాలు పరిశీలిస్తున్నాయి. జాతీయ స్థాయి ఎంపిక చేసిన బడులకు రూ.లక్ష నగదుతోపాటు జాతీయ పురస్కారం అందనుంది. జిల్లాలో రాష్ట్ర కమిటీ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుందని జీసీడీవో కవిత తెలిపారు.

**ఎంపికైనవి ఇవే**

గ్రామీణ కేటగిరీ-1: ప్రాథమిక పాఠశాల సుద్దాల, ఎల్కలపల్లి, కాట్నపల్లి.గ్రామీణ కేటగిరీ-2: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మల్లాపూర్, జడ్పీ ఉన్నత పాఠశాల సుల్తాన్‌పూర్, కస్తూర్బా గాంధీ పాఠశాల సుల్తానాబాద్.పట్టణ కేటగిరీ-1: ప్రాథమిక పాఠశాల చందపల్లి.పట్టణ కేటగిరీ:2: కేంద్రీయ విద్యాలయం ఎన్టీపీసీ

## ప్రైవేటు వ్యాపారులకు మద్దతు



ధర్మారం : ప్రైవేటు వ్యాపారులు పత్తి ధర మాట్లాడుకున్నప్పుడే పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు ప్రతులు ఇవ్వమంటున్నారు. చరవాణికి వచ్చే ఓటీపీ చెప్పాలంటున్నారు. - జూలపల్లి మండలం అబ్బాపురానికి చెందిన ఓ మహిళా రైతు

పత్తి రైతులకు మద్దతు ధర అందించాలన్న లక్ష్యంతో సీసీఐ తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ కొన్నిచోట్ల వ్యాపారులకే ప్రయోజనకరంగా మారుతోందని పై ఉదంతం తెలియజేస్తోంది. సీసీఐ ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,110 (పొడవు పింజ), రూ.7,710 (మధ్యస్థ పింజ)గా ఉంది. అయితే యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయడం, అనుమతించిన రోజే మార్కెట్‌కు తరలించడం కష్టసాధ్యమని అక్కడకు వెళ్లాక తిరస్కరిస్తే అత్యంత తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని ప్రైవేటు వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. నాణ్యమైన పత్తి రూ.6,500 నుంచి రూ.7,000 వరకు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే ఇంకా తక్కువకే కొంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన పత్తిని రైతుల పేరిట కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసి సీసీఐకి విక్రయిస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

**సులభమే..**

గూగుల్ ప్లే స్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.అందుబాటులో ఉన్న మార్కెట్, పత్తిని విక్రయించే మిల్లును ఎంచుకోవాలి.

స్లాట్ బుక్ చేయగానే సంబంధిత వ్యక్తి చరవాణికి ఓటీపీ వస్తుంది. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1800 599 5779ను సంప్రదించవచ్చు.

**అధికారులు స్పందిస్తేనే..**

సీసీఐ కేంద్రాల వద్ద రైతుల పేరుతో ప్రైవేటు వ్యాపారులు పత్తి విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే సగానికిపైగా పత్తి రైతుల చేయి దాటిపోయింది. కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించి వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే రైతులు నేరుగా సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందే అవకాశముంది.

## సౌర.. ఔరా 'సుమధుర'

రాయదుర్గం : సౌర విద్యుత్తు ప్లాంటు నిర్మాణంతో నానక్‌రాంగూడలోని సుమధుర ఆక్రోపోలిస్ అపార్ట్‌మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీవాసులు ఆదర్శంగా నిలిచారు. అపార్టుమెంట్‌లో తరచూ విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా ఇబ్బందులు పడేవారు. సమస్యను ఓ సందర్భంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లగా సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని వారికి ఆయన సూచించారు.

**295 కిలోవాట్ల సామర్థ్యంతో..**

576 ఫ్లాట్లలోని గేటెడ్ కమ్యూనిటీ సభ్యులంతా సమావేశమై చర్చించి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడ్డారు. అపార్టుమెంట్‌వాసులపై భారం వేయకుండా కమిటీ కార్పస్ ఫండ్‌పై వచ్చిన వడ్డీ రూ.30 లక్షలకు,



మరో రూ.కోటి బ్యాంకు రుణం తీసుకున్నారు. 295 కిలోవాట్ల సామర్థ్యంతో రోజుకు 1,300 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా 31వ అంతస్తు పైన 9 అడుగుల ఎత్తులో ఫలకాలను ఏర్పాటు చేశారు. ఫలకాల కింద సమావేశాలకు, మొక్కల పెంపకానికి వెసులుబాటు ఉండేలా చూశారు.

**నెలకు రూ.3లక్షల ఆదా**

రోజుకు 1,300 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. వేసవిలో సామర్థ్యం పెరిగితే నెలకు 40 వేల యూనిట్ల వరకు ఉత్పత్తయ్యే అవకాశం ఉంది. 25 ఏళ్లవరకు ఉత్పత్తి కేంద్రం పనిచేస్తుందని, తొలి ఏడాది నిర్వహణను ప్రైవేటు సంస్థే చూస్తుందని సొసైటీ ఛైర్మన్ శ్రీరామ రావు, వైస్ ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్, కార్యదర్శి డీవీ రెడ్డి తదితరులు తెలిపారు. నెలవారీగా రూ.3 లక్షల కరెంట్ బిల్లు ఆదా అవుతుందని, దాన్ని బ్యాంకు రుణానికి మళ్లించి నాలుగేళ్లలో రుణం తీర్చుతామని తెలిపారు.

## సిబ్బంది లేరు.. ఉన్నోళ్లు పలకరు!

ఖమ్మం : రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగమైన డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ) నిర్లక్ష్యానికి గురవుతోంది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కీలక వ్యవస్థ లక్ష్యం నీరుగారిపోతుంది. ఓవైపు సిబ్బంది కొరత, మరోవైపు ఉన్నవారు సైతం సక్రమంగా విధులు నిర్వర్తించకపోవటం సమస్యగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, వైద్యనిపుణుల బాధ్యతారాహిత్యం వెరసి కేంద్రంలో సేవలు అంపశయ్యకు చేరుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి..**

పుట్టకతో వచ్చే లోపాలను ప్రాథమిక దశలో గుర్తించి నయం చేయటమే ఈకేంద్రం ముఖ్యోద్దేశం. పిల్లలకు సకాలంలో సేవలు లభించకపోవటంతో శాశ్వత వైకల్యానికి గురయ్యే ప్రమాదముంది. వైద్యులు ఉన్నా రోగులు ఇక్కడికి రాకపోవటం సమస్యగా మారింది. క్షేత్రస్థాయికి, కేంద్రానికి మధ్య సమన్వయ లోపమే దీనికి కారణం. ఇక్కడ ఫిజియో థెరపీ, దంత విభాగాలకు చెందిన వైద్యనిపుణులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వీరు కూడా సర్వజనాసుపత్రిలో రిఫరల్ పిల్లలు ఉంటే చికిత్సలందిస్తున్నారు. లేదంటే ఖాళీగా ఉంటున్నారు. మిగిలిన విభాగాల్లో నిపుణులు ఎవరు, ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని దుస్థితి.

**రూ.లక్షల పరికరాలు ఉన్నా..**

ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఈకేంద్రంలో పరికరాలను ఏర్పాటు చేసింది. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఇతర పరికరాలు దుమ్ముపట్టిపోతున్నాయి. అప్తమాలజీ విభాగానికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఖరీదైన పరికరాలు మూలన పడేయటంతో పనికిరాకుండా పోతున్నాయి. ల్యాబ్‌లోని పరికరాలను వాడకపోవటంతో పాడైపోయాయి. వైద్యసిబ్బంది బయోమెట్రిక్ హాజరు యంత్రం, పర్యవేక్షణ, భద్రత కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు సైతం వృథాగా ఉండి వైర్లు వేలాడుతున్నాయి. అధికారులు మాత్రం తాము ఈఏడాది చికిత్సలు అందించిన వారి లెక్కలు తమ వద్ద ఉన్నాయంటూ రికార్డుల్లో చూపుతున్నారు. ఉన్నతాధికారులు



దృష్టిసారించి ఈకేంద్రంలో అందించే సేవలపై నమ్మకం పెంపొందించాల్సిన అవసరముంది.

**కొరవడిన పర్యవేక్షణ**

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య సమస్యలను ఆర్‌బీఎస్‌కే బృందాలు గుర్తించి డీఈఐసీకి పంపించాలి. వాహనాల్లో కేంద్రానికి చేర్చి తగిన చికిత్సలు ఇప్పించాలి. మండలం నుంచి ఎంతమంది పిల్లలను కేంద్రానికి తీసుకొస్తున్నారు? ఏ సమస్యలతో వస్తున్నారు? ఎంతమందికి చికిత్సలు అందించారు? అనే విషయాలపై పర్యవేక్షణ కొరవడింది.

డీఈఐసీలో తగిన చికిత్సలు అందించటానికి చర్యలు తీసుకుంటాం. వైద్యసిబ్బంది పనితీరుపై దృష్టి సారిస్తాం. ఖాళీల భార్తీపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- డాక్టర్ రామారావు, డీఎంహెచ్ఓ

ఈ ఏడాదిలో చికిత్సలు పొందినట్లుగా రిజిస్టర్లలో నమోదైన పిల్లల గణాంకాలు

చర్మ సమస్యలు: 352
అనీమియా: 106
దంత సమస్యలు: 1,188
ఫిజియోథెరపీ: 710
స్పీచ్, ఇయరింగ్ థెరపీ: 652
అప్తమాలజీ: 1,102
ఇతర సమస్యలు: 527

## భా'స్వరం' వినాల్సిందే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని పంటపొలాల్లో రసాయన ఎరువుల వినియోగం మోతాదు పెరిగిపోయినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. సేంద్రియ సాగు విధానమే మేలని సూచిస్తున్నారు. రైతులు అవసరం ఉన్నా.. లేకున్నా దిగుబడి ఎక్కువ వస్తుందన్న కారణంతో భాస్వరం ఉండే 20:20, డీఏపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులను మోతాదుకు మించి ఉపయోగిస్తున్నారు. అది మొక్కకు 20 శాతం మాత్రమే అంది మిగిలిన 80 శాతం భూపొరల్లో నిల్వ ఉండిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమిలో పేరుకుపోయిన నిల్వలను కరిగించడానికి జీవ ఎరువులే ముఖ్యం. భూమిలో కరిగిపోకుండా మిగిలిపోయిన భాస్వరం పోషకాన్ని ఇవి కరిగించి మొక్కలకు అందిస్తాయి. మొక్కలకు మేలు చేసే



బ్యాక్టీరియాకు సంబంధించిన పాస్ఫో బ్యాక్టీరియం, మెగాథీరియం తదితర పాస్ఫరస్ సాలిబులైజ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) జీవ ఎరువులను వినియోగిస్తే నేలలో ఉన్న భాస్వరం నిల్వలు కరిగిపోతాయి. ఫలితంగా నీరు, పోషకాలు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతాయి. దీంతో పాటు పిల్లి పెసర, జనుము, జీలుగు లాంటి పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే నేల సారవంతమై దిగుబడులు పెరగనున్నాయని కంపాసాగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 17,254 మట్టి నమూనాలు సేకరించారు. ఇందులో పంట భూముల్లో నత్రజని వనరుల లభ్యత తక్కువగా ఉందని.. అవసరానికి మించిన భాస్వరం నిల్వలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. వచ్చే పంటకాలాల్లో భాస్వరం ఉపయోగించకపోవడమే మేలని వారు పేర్కొంటున్నారు.

## ఉచిత వైఫై వాడుతున్నారా?

హైదరాబాద్: నేటి డిజిటల్ యుగంలో అంతర్జాలం రోజువారీ అవసరంగా మారింది. వివిధ అవసరాల నిమిత్తం చాలామంది ఫ్రీ వైఫై వినియోగిస్తుంటారు. బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు.. ఇలా పబ్లిక్ ప్లేస్‌లో ఫ్రీ వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పబ్లిక్ వై-ఫై వాడే సమయంలో డేటా చోరీ, ఆర్థిక మోసం జరిగే ప్రమాదం ఉందని భారత ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ హెచ్చరించింది.



**నష్టాలు ఇవే..**

భద్రతా లోపం..: పబ్లిక్ వైఫైలో తగినంత భద్రత ఉండదు. హ్యాకర్లు మనల్ని మోసం చేయడానికి నకిలీ వైఫై నెట్‌వర్క్‌లను రూపొందిస్తుంటారు. డేటా చోరీ..: పబ్లిక్ వైఫైకి కనెక్ట్ అయిన వెంటనే హ్యాకర్లు మీ ఫోన్ పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఈ-మెయిల్స్ వంటి వాటిని సులభంగా అపహరించే ప్రమాదం ఎక్కువ. మీ ఫోన్‌లోకి వైరస్‌లను పంపి, సమాచారం సేకరించడం హ్యాకర్లకు చాలా సులభం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే..: వీలైనంత వరకు పబ్లిక్ వైఫైని వాడకపోవడం ఉత్తమం. అత్యవసర పరిస్థితుల్లో వీపీఎన్ వాడటం ఉత్తమం. తద్వారా కొంత వరకు భద్రత లభిస్తుంది.

## విలీనమైతే లాభమా.. నష్టమా?

హైదరాబాద్: గ్రామాలను దగ్గర్లోని పురపాలికలు, నగరపాలక సంస్థల్లో కలిపేశారు. ఇప్పుడు ఆయా పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లను తీసుకెళ్లి జీహెచ్‌ఎంసీలో విలీనం చేయబోతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై.. విలీనం కానున్న స్థానిక సంస్థల పరిధిలోని ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రయోజనాలు, నష్టాలపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. సర్కారు తీసుకున్న విలీన నిర్ణయంపై మెజార్టీ ప్రజలు సానుకూలంగా ఉన్నప్పటికీ.. జనాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.

రకరకాల ప్రశ్నలు.. గ్రేటర్‌లో విలీనం చేస్తే ఆస్తిపన్ను పెరుగుతుందా, మేము చెల్లించే పన్నులను వేరే ప్రాంతాల్లో ఖర్చు చేస్తారా? అని జనాలు రకరకాల ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తిపన్ను ద్వారా ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. జవహర్‌నగర్, జల్‌పల్లి, తుక్కుగూడ వంటివి ఆదాయ వనరులు లేక అవస్థ పడుతున్నాయి. ఇప్పుడు అన్నింటినీ గ్రేటర్‌లో కలిపేస్తే.. నిధులను ఎలా ఖర్చు చేస్తారోనని చర్చించుకుంటున్నారు.

**ముందున్న సవాళ్లు..**

నగరానికి చేరువగా ఉన్నప్పటికీ.. విలీన ప్రాంతాల్లో వందలాది గ్రామాలు ఉన్నాయి. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేటప్పుడు.. గ్రామీణ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. విశాల నగరం అయినప్పటికీ.. జన సాంద్రత ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంది. మణికొండ, నార్సింగి ప్రాంతాల్లో జన సాంద్రత అధికం. పెద్దఅంబర్‌పేట్, ఘట్‌కేసర్, తుక్కుగూడ ప్రాంతాల్లో తక్కువ. వాటిని దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి సమతూకంలో ఉండేట్టు అధికారులు జాగ్రత్త తీసుకోవాలి.

డివిజన్ల పునర్విభజన అనేక రాజకీయ, సామాజిక సవాళ్లను సృష్టిస్తుంది. వాటిని పరిష్కరించినప్పుడే.. ఎలాంటి దుమారం లేకుండా బృహత్‌నగర పరిపాలన గాడిలో పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అమ్మబోతే కొర్రీలు.. కొన్నాక కోతలు



గంగాధర : ఈ చిత్రంలో పేరుకున్న ధాన్యం నిల్వలు గంగాధర మార్కెట్ యార్డులోని ప్యాక్స్ కేంద్రంలోనివి. సాధారణంగా బస్తాకు 40 కిలోలు, బస్తాకు కలుపుకొని 40.600 కిలలో చొప్పున తూకం వేయాలి. కానీ కొన్ని చోట్ల 42.250 కిలోలు, మరికొన్ని చోట్ల దీనికంటే అధికంగా తూకం వేస్తున్నారు. అలా అయితేనే దింపుకొంటామని రైస్‌మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో నాలుగు రోజులుగా ధాన్యం తూకం నిలిపివేశారు. గంగాధర ప్యాక్స్ పరిధిలో ఆరు కేంద్రాలు, కురిక్యాల ప్యాక్స్ పరిధిలో 11 కేంద్రాల్లో రెండ్రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. వరి ధాన్యం పండించే శ్రమ కన్నా అమ్ముకోవడమే అన్నదాతకు కష్టంగా మారింది. యాసంగి పంటల సాగులో తలమునకలు కావాల్సిన వారు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి అరిగోస పడుతున్నారు. జిల్లాలోని పలు కేంద్రాల నుంచి పంపిన ధాన్యం బస్తాలను మిల్లర్లు ఆలస్యంగా దింపుకొంటున్నారు. దీంతో తూకం వేసిన ధాన్యంలోనూ బరువు నష్టపోతున్నారు. మిల్లు యాజమాని తక్కువ బరువు ఉందని కోత విధించి కేంద్రం నిర్వాహకులకు ఫోన్లో సమాచారమిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర నిర్వాహకుడు రైతుకు తెలియజేయగా.. చేసేదేమిలేక ఒప్పుకుంటున్నారు. **సన్నాలు కావాలని.. వడ్లు నిండుకున్నాయని..**

జిల్లాలో 325 కేంద్రాల ద్వారా 32,390 రైతుల నుంచి 2,00,325 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 1,98,901 మె.ట తరలించారు. ఇంకా 1423 మె.ట ధాన్యం కేంద్రాల నుంచి తరలించాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు బాగుండీ, వడ్లు తేమ లేకుండా ఉన్నప్పటికీ తూకం వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్నాలు కావాలని, ఇప్పటికే దొడ్డు రకం ధాన్యంతో రైస్‌మిల్లుల్లో స్థలం లేదని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. లేకపోతే 43.500 కిలోలు తూకం వేసి పంపిస్తేనే దింపుకొంటామని చెప్పడంతో చాలా కేంద్రాల్లో ధాన్యం తూకాలను నిలిపివేశారు.

**సమస్య మా దృష్టికి రాలేదు..**

సమస్య మా దృష్టికి రాలేదు. కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. ఏదైన సమస్య ఉంటే రైతులు మాకు చెప్పాలి.

– రజనీకాంత్, పౌరసరఫరాల శాఖ డీఎం

**చాలా ఇబ్బందిగా ఉంది**

లారీలు రావడంలేదని, సంచులు లేవని నాలుగు రోజులుగా కొనుగోళు నిలిపివేశారు. ధాన్యం ఆరబెట్టినా ఎక్కువ తూకం వేస్తామంటున్నారు. మార్కెట్‌లోంచి ధాన్యం తీసుకెళ్లి ప్రైవేటుకైనా అమ్ముకుంటాం.

– రుద్రాక్ష మంజుల, గంగాధర

**43 కిలోల పైగా తూకం**

15 రోజులుగా ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్‌కు వస్తున్నాం. 43 కిలోలపైగా తూకం వేస్తామంటున్నారు. పంట పండించడం కంటే కూలీ పనులకు వెళ్లడమే మంచిది.

– అమిరిశెట్టి రాజు, గంగాధర

# పాండవుల గుట్టపై కబ్జాదారుల కన్ను



కాల్వశ్రీరాంపూర్ : అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలు మాయమైపోతుండగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పాండవుల గుట్ట క్రమంగా తరిగిపోతోంది. ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్ స్టేషన్, మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, రెండు పడక గదుల నిర్మాణం, రైతు వేదిక, పల్లె ప్రకృతివనం, విద్యుత్తు ఉప కేంద్రం, శ్రీజగత్ మహామునీశ్వర స్వామి ఆలయానికి, అయ్యప్ప దేవాలయానికి కొంత భూమి కేటాయించారుఈ ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు, మరి కొందరూ ఎలాంటి పట్టా లేకున్నా కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**పెద్దల అండదండలతో..**

వాస్తవంగా మట్టి తవ్వకాలు చేపట్టాలనుకునేవారు మొదట గనులశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే ఎన్‌ఓసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) సంబంధిత తహసీల్దార్‌కు పంపుతారు. అనంతరం గనులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి ఒకేసారి నిర్ణీత మట్టి తవ్వకాల ప్రదేశాన్ని సర్వే చేయాలి. ఇవన్నీ ఉంటే మట్టి తవ్వకాలకు అనుమతించగా మట్టికి రాయల్టీ రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

**రాయల్టీకి గండి**

ట్రాక్టర్లు కాకుండా లారీల్లో మట్టిని గృహాలు, వేడుక వేదికలు, వెంచర్ల ప్రదేశాలకు చేరవేస్తున్నారు. ఇలా నిబంధనలు విస్మరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి పడుతోంది.

ఈ విషయంపై తహసీల్దార్ జగదీశ్వర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని వివరించారు.

# అంగన్‌వాడీలకు మహర్దశ



జగిత్యాల : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు ఇక తీరనున్నాయి. స్లాబు లీకేజీలు, కిటికీలు సక్రమంగా లేకపోవడం, వెలసిపోయిన గోడలకు సంబంధించి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 1065 కేంద్రాలుండగా.. వీటిలో సొంత భవనాలు 286, ఉచిత అద్దె భవనాలు 239, అద్దెకు సంబంధించి 540 ఉన్నాయి. వీటిలో గర్భిణులు, బాలింతలు, టీహెచ్‌ఆర్ తీసుకుంటున్న వారు, చిన్నారులు లబ్ధి పొందుతున్నారు.

**తొలగిన స్థానిక కోడ్ అడ్డంకి**

ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా పెద్ద మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదన్న ఉద్దేశంతో సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గతంలో ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

**రూ.2.50 లక్షల చొప్పున**

ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల చొప్పున మరమ్మతుల కోసం 56 కేంద్రాలకు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఈ పనులు పంచాయతీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అయితే సొంత భవనాలున్న మరో 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు అవసరమని నివేదించగా, నిధుల మంజూరుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

**పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రభుత్వం చేపట్టే పనులంటేనే ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. గతంలో మల్యాలలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేపట్టిన రేకుల షెడ్డులో వర్షం నీరు లీకవడంతో నిర్వాహకులు, లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఇందులో నట్టు, బోల్ట్ సక్రమంగా బిగించకపోవడం కారణమని గుర్తించి సరిచేశారు. ఈ లెక్కన మరమ్మతు పనులకు ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అవసరముంది.

**సక్రమంగా జరిగేలా చూస్తాం**

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం కోడ్ తొలగిపోవడంతో అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. త్వరలో మరమ్మతు పనులు మొదలవుతాయి. సక్రమంగా అభివృద్ధి జరిగేలా పర్యవేక్షిస్తాం. డా.నరేశ్, జిల్లా సంక్షేమాధికారి

## వాళ్లొస్తే డిగ్రీ.. వీళ్లొస్తే ఎంబీఏ

హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ కోర్సులకు అనుమతి పొందుతున్న కొన్ని ప్రైవేటు కళాశాలల యజమానులు ఒకే భవనంలో ప్రైవేటు వర్సిటీలు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ఇంటిగ్రేటెడ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఓయూ అనుబంధ గుర్తింపున్న కళాశాలల్లో ఇలా ఇతర వర్సిటీల తరగతులు బోధించకూడదు. రాంనగర్‌లో సన్ డిగ్రీ కళాశాల యాజమాన్యం దిల్లీలోని ఓ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి తరగతులు నిర్వహిస్తోంది. ఓయూ ఆడిట్ విభాగం ఇటీవల తనిఖీలు నిర్వహించి సన్ డిగ్రీ కళాశాలకు రూ.8 లక్షల జరిమానా విధించింది. సన్ డిగ్రీ కళాశాలతో పాటు గ్రేటర్ పరిధిలోని మరికొన్ని ప్రైవేటు కళాశాలలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఓయూ అధికారులు వచ్చినప్పుడు ఆ భవనం డిగ్రీ కళాశాలగా మారిపోతుంది. ప్రైవేటు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ప్రతినిధులు వెళ్లినప్పుడు ఎంబీఏ, ఎంసీఏ కళాశాల బోర్డు ఉంటుంది. ఈ అక్రమ వ్యవహారం ఇప్పటి వరకు గుట్టుగా సాగింది. ఓయూ అధికారులు కొందరు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్గతంగా సమాచారాన్ని సేకరిసున్నారు.



**ఎంబీఏ, ఎంసీఏలకు గుర్తింపు వర్తించకున్నా..** ఇతర రాష్ట్రాల వర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రైవేటు కళాశాలల యజమానులు అదే భవనంలో ఎంబీఏ, ఎంసీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సులను నిర్వహిస్తున్నారు. రికార్డుల ప్రకారం ఆయా కోర్సులు చదువుకుంటున్న వారు ఓయూ పరిధిలోకి రారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నా ప్రైవేటు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నట్లు గానే వ్యవహరిస్తారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

ఓయూ పరిధిలో కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల భవనాల్లో ఇతర రాష్ట్రాల వర్సిటీలకు చెందిన ఎంబీఏ , ఇంటిగ్రేటెడ్ కాలేజీలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇకపై ఆకస్మిక తనిఖీలు చేస్తాం.

ఆచార్య కుమార్ మొలుగరం, ఉపకులపతి, ఓయూ

## బషీరాబాద్.. కన్నడిగుల జిందాబాద్

బషీరాబాద్ : రాష్ట్రం వేరైనా వర్తకం మాత్రం ఇక్కడికే అంటున్నారు.. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రజలు. నిత్యం బషీరాబాద్ మండల కేంద్రానికి వచ్చి వివిధ పనులు చేసుకొని వెళతారు. నిజాం పాలనలో కలబురిగి (గుల్బర్గా) రాష్ట్రం ఉండగా.. బషీరాబాద్ జిల్లా కేంద్రం ఉండేది. అప్పటి నుంచే బషీరాబాద్‌లోనే అన్ని పనులు చేసుకోవడం అలవాటుగా మారిందని వివరిస్తున్నారు.

**ప్రసవాలు ఇక్కడే..**

బషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు స్థానిక రోగులతోపాటు కర్ణాటకకు చెందిన వారు సేవలు పొందుతున్నారు. ప్రాంతీయ భేదం లేకుండా సేవలు అందిస్తున్నామని వైద్యులు అంటున్నారు. రోజూ



80-100 మందిలో 25 మంది పొరుగు రాష్ట్రం రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. హల్కోడ, వెంకటాపూర్, పోతంగల్, జెట్టూరు, అయ్యాలం మహిళలు ప్రసవాలకు బషీరాబాద్‌కు వస్తున్నారు. ప్రతి మంగళవారం సంత రోజున బషీరాబాద్ నుంచి ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా ఆటోలు, జీపులు నడిపిస్తారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ప్రతిరోజు వందల సంఖ్యలో వస్తున్నారు.

**ఊరక్కడ.. భూములు ఇక్కడ**

జీవన్గీ, బషీరాబాద్, ఇందర్‌చేడ్, గంగ్వార్, క్యాద్గిర గ్రామాల పరిధిలో కర్ణాటక రైతులకు భూములున్నాయి. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి అందించే రైతుబంధు, ఇతర పథకాలను సైతం కన్నడిగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను బషీరాబాద్, తాండూరు విపణికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు.

## బాల్యంలో లగ్గం.. అధికారుల పగ్గం

తాండూరు :"మేళ తాళాల మధ్య మాంగల్యం తంతునానేనా అని పెళ్లి మంత్రం ఎక్కడి నుంచైనా వినిపిస్తే ఆహా ఎంత శుభకరం.. అని భావిస్తుంటాం. కానీ బాల్యం ముగియకుండానే వివాహాలు చేయడమనేది ఆరోగ్యపరంగా అశుభకరం." జిల్లాలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, చైల్డ్‌లైన్ బృందాలు బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన కట్టుదిట్టమైన నిఘా, గ్రామీణ స్థాయిలో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఏకంగా 430బాల్య వివాహాలను అడ్డుకోవడం విశేషం. గ్రామాల్లో వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఇస్తున్న సమాచారంతో అధికారులు వెంటనే స్పందించడంతో బాలల భవితకు బాటలు పడేందుకు తోడ్పడింది.

**అవగాహన సదస్సులతో..**

తాండూరు పట్టణాన్ని ఆనుకొని ఉన్న గ్రామానికి చెందిన బాలికతో మరో గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల బాల్య వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేయగా.. ఐసీడీఎస్ అధికారులు వెళ్లి నిలువరించారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.ః చెంగోల్‌లో ఆరు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేశారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలను తల్లిదండ్రులకు వివరించి పెళ్లి ఆలోచనను విరమింపజేశారు.

**చట్టం ప్రకారం శిక్షార్హం**

బాలికలు మేజర్ అయితే విద్య, ఉపాధి అవకాశాలపై స్పష్టత వస్తుంది. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారు. ఈక్రమంలో బాల్య వివాహాలను గ్రామస్థాయిలో నిలువరించడానికి సమాచార నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పాటు చేసుకున్నాం. అవగాహన సదస్సుల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం యువజన సంఘాలు తోడ్పాటు అందిస్తున్నాయి. వధువుకు 18 ఏళ్లు, వరుడుకి 21 సంవత్సరాల వయస్సు నిండితేనే వివాహం జరిపించాలి.వెంకటేషం, బాలల సంక్షేమ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్




# రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు పనులు ముమ్మరం

అమరావతి: రాజధాని పరిధి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే పనులను ముమ్మరం చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని.. వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు. 6 నెలల్లో గ్రామాల్లోని పనులన్నీ పూర్తిచేస్తామని వివరించారు. సోమవారం వడ్డమానులో రహదారిని ప్రారంభించిన అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. రాజధానిని గుంటూరు, విజయవాడ సహా పలు ప్రాంతాలకు అనుసంధానించే రోడ్డు పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. వెస్ట్ బైపాస్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కరకట్టకు సమాంతరంగా సీఆర్‌డీఏ రోడ్డును మంగళగిరి రోడ్డుకు అనుసంధానిస్తామన్నారు. దేశానికి మాజీ ప్రధాని వాజ్‌పేయీ చేసిన అపూర్వ సేవలను స్మరించుకుంటూ రాజధానిలో ఆయన విగ్రహాన్ని ఈనెల 25న ఆవిష్కరిస్తామని చెప్పారు.

# ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డికి నోటీసులు




అమరావతి, డిసెంబర్ 22: ఐపీఎస్ ఆఫీసర్ అమ్మిరెడ్డికి రాష్ట్ర శాసన మండలి సోమవారం నోటిసులు పంపింది. ఆయన.. గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కించపరిచేలా ట్వీట్ చేశారనే కారణంతో ఈ నోటీసులు ఇస్తున్నట్టు స్పష్టం చేసింది. శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ మంగళవారం మధ్యాహ్నం సమావేశం కానుంది. అదే సమావేశంలో మధ్యాహ్నం 2:30 గంటలకు ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డి హాజరు కావాలని నోటీసులో పేర్కొంది ప్రివిలేజేస్ కమిటీ.



# బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి హత్య..

బంగ్లాదేశ్‌లో మతోన్మాదానికి బలయిన హిందూ యువకుడు దీపూ చంద్ర దాస్ ఉదంతంలో తాజాగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్లాన్ ప్రకారం, అతడి హత్య జరిగినట్టు తెలుస్తోంది. మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ దుస్తుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న దీపు చంద్ర దాస్ (27)పై కొందరు దైవ దూషణ ఆరోపణలు మోపి గురువారం దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. మతోన్మాద మూకలు దాడి చేసి అతడిని పొట్టనపెట్టుకున్నాయి. అనంతరం మృతదేహానికి నిప్పు పెట్టాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పక్కా ప్లానింగ్‌తో ఈ దారుణం జరిగినట్టు తెలుస్తోంది. దాడికి కొన్ని గంటల ముందు ఫ్యాక్టరీలోని సూపర్‌వైజర్లు దీపూతో బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించారు. ఆ తరువాత ఫ్యాక్టరీ నుంచి బయటకు పంపి అల్లరి మూకలకు అప్పగించారు. దుస్తుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు కూడా ఈ దాడిలో పాలుపంచుకున్నట్టు బంగ్లాదేశ్ రాపిడ్ యాక్షన్ బెటాలియన్, పోలీసు అధికారులు చెబుతున్నారు. పోలీసులకు సకాలంలో సమాచారం అందించి ఉంటే అతడు బతికి ఉండేవాడని కూడా చెబుతున్నారు. ఇక, దీపూ దైవ దూషణకు పాల్పడినట్టు ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకూ సుమారు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దుస్తుల ఫ్యాక్టరీ అధికారులు, వర్కర్లు కూడా ఉన్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీపూ హత్య అకస్మాత్తుగా జరిగినది కాదని కూడా అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు కొన్ని గంటల ముందే ప్లానింగ్ జరిగి ఉంటుందని చెబుతున్నారు. దీపూతో బలవంతంగా రాజీనామా చేయించడం, పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం జరగడం, బాధితుడిని అల్లరి మూకలకు అప్పగించడం వంటి వన్నీ ఘటనకు ముందు జరిగిన ప్లానింగ్‌ను సూచిస్తున్నాయని అన్నారు. మరోవైపు, ఈ ఉదంతంపై ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ కూడా పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ దారుణంలో పోలీసులు పాత్ర కూడా ఉండి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో న్యాయం జరుగుతుందా అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీపూకు మూడు ఏళ్ల క్రితం వివాహమైంది.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ నారాయణన్

తిరుమల, డిసెంబర్ 22: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్ డా. వి. నారాయణన్ ఇవాళ తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మేజర్ మిషన్లకు ముందు ఇస్రో అధికారులు తిరుమల దర్శనం చేసుకోవడం సంప్రదాయం. ఈసారి డిసెంబర్ 24న జరగబోయే ముఖ్యమైన లాంచ్‌కు శ్రీవారి ఆశీస్సులు కోరుకున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీ ఉదయం 8:54 గంటలకు శ్రీహరికోట నుంచి బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం-3 ఎం6 ద్వారా అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ కంపెనీకి చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఇది భారత్ నుంచి ఇప్పటివరకు లో ఎర్త్ ఆర్బిట్ (%బాజూ%)లోకి పంపిన అత్యంత బరువైన కమర్షియల్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇది.. దాదాపు 223 చదరపు మీటర్ల భారీ ఫేజ్డ్ అరే ఆంటెన్నాతో కూడినది. ఈ ఉపగ్రహం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సాధారణ స్మార్ట్‌ఫోన్లకు నేరుగా 4జీ, 5జీ సిగ్నల్స్ అందించి, మొబైల్ కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది. ముఖ్యంగా రిమోట్ ప్రాంతాలు, సముద్రాలు, ఎడారుల్లో కూడా హై-స్పీడ్ ఇంటర్నెట్, వాయిస్ కాల్స్, వీడియో స్ట్రీమింగ్ సాధ్యమవుతుంది. ఇది న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ద్వారా జరిగే కమర్షియల్ మిషన్. ఇస్రో ఈ ఏడాది ఫుల్ బిజీగా ఉంది. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి మిషన్లతో పాటు కమర్షియల్ లాంచ్‌లు కూడా పెరుగుతున్నాయి. ఈ మిషన్ విజయవంతమై భారత్ స్పేస్ సెక్టార్‌లో మరింత బలోపేతం అవుతుందని అంచనా.





# గగనతలంలో ఎమర్జెన్సీ..

## విమానం ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకు.. గగనతలంలో ఎమర్జెన్సీ

గగనతలంలో ఎయిరిండియా విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది. సాంకేతికలోపం కారణంగా ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోయింది. దిల్లీ నుంచి ముంబయికి బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఈ లోపాన్ని గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 3.20 గంటల సమయంలో ఎయిరిండియా బోయింగ్ విమానం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కుడివైపు ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. తర్వాత అది జీరోకు పడిపోయింది. దాంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయినచోటే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. భద్రతా ప్రోటోకాల్స్ ఆధారంగా విమాన సిబ్బంది నిర?యం తీసుకున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఆ విమానంలో సాంకేతికపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ ఊహించని పరిస్థితి వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులు ముంబయి చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొన్ని రోజుల క్రితం కూడా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన సంగతి తెలిసిందే. ఏపీలోని గన్నవరం నుంచి విశాఖ బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా నిలిచిపోయింది. అప్పుడు విమానంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు 163 మంది ప్రయాణికులు ఉన్నారు.



# అన్నదమ్ముల దారుణహత్య

## పల్నాడు జిల్లాలో ఘోరం.. అన్నదమ్ముల దారుణహత్య

దుర్గి: పల్నాడు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్నదమ్ములను గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. దుర్గి మండలం అడిగొప్పలలో ఈ ఘటన జరిగింది. తమ్ముడు కొత్తా హనుమంతు, అన్న కొత్తా శ్రీరాంమూర్తిని ఆదివారం అర్ధరాత్రి వేటకొడవళ్లతో హతమార్చారు. హనుమంతును గ్రామం మధ్యలో.. శ్రీరాంమూర్తిని అమ్మవారి గుడి సమీపంలో అత్యంత కిరాతకంగా చంపేశారు. మృతులిద్దరినీ తెదేపా సానుభూతిపరులుగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

**నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టొద్దు: మంత్రి గొట్టిపాటి..** ఈ జంట హత్యలపై పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆయన మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని ఆదేశించారు.

ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిటిషన్ మీద సానుకూలంగా స్పందించిన ఢిల్లీ హైకోర్టు



ఢిల్లీ, డిసెంబర్ 22: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. తన వ్యక్తిగత హక్కులు, గౌరవానికి భంగం కలగకుండా చూడాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మీద ఇవాళ విచారణ జరిగింది. తన అనుమతి లేకుండా తన పేరు, చిత్రం, గొంతు, ఇంకా వ్యక్తిత్వానికి సంబంధించిన అంశాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోకుండా నిరోధించాలని పవన్ ఈ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తరఫున ప్రముఖ సీనియర్ న్యాయవాది జె. సాయి దీపక్ వాదనలు వినిపించారు. సోషల్ మీడియా వేదికలు, ఈ-కామర్స్ సైట్లు, ఇతర ప్లాట్‌ఫారమ్‌లలో తన ప్రతిష్టను దిగజార్చేలా లేదా తన అనుమతి లేకుండా తన ఇమేజ్‌ను వాడుకుంటున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక కీలక రాజ్యాంగ పదవిలో ఉన్నందున, తన వ్యక్తిత్వానికి భంగం వాటిల్లడం వల్ల తన ప్రజా జీవితంపై ప్రభావం పడుతుందని పవన్ కళ్యాణ్ తన పిటిషన్ లో కోర్టుకు వివరించారు. దీంతో.. 2021 ఐటీ నిబంధనల ప్రకారం, అభ్యంతరకర కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టు సంబంధిత సంస్థలను ఆదేశించింది. పవన్ కళ్యాణ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ, సంబంధిత సోషల్ మీడియా సంస్థలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లకు నోటీసులు జారీ చేసింది. పవన్ కళ్యాణ్ ప్రమేయం లేకుండా ఆయన ఇమేజ్‌ను వాడుతున్న లింకులను తొలగించాలని కూడా కోర్టు సూచించినట్లు సమాచారం.

**వ్యక్తిత్వ హక్కులు అంటే ఏమిటి?...** ఒక ప్రముఖ వ్యక్తికి సంబంధించి వారి పేరు, గొంతు, సంతకం లేదా ముఖచిత్రాన్ని వారి అనుమతి లేకుండా ఇతరులు వాణిజ్యపరంగా వాడుకోకుండా ఉండే హక్కునే 'పర్సనాలిటీ రైట్స్' అంటారు. గతంలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ వంటి అగ్ర నటులు కూడా ఇటువంటి హక్కుల కోసం కోర్టులను ఆశ్రయించి సానుకూల ఉత్తర్వులు పొందారు.

# రోకలిబండతో వదినను కొట్టి చంపిన మరిది



ఆలూరు గ్రామీణం: ఆస్పరి మండలం తొగలగల్లు గ్రామంలో దారుణ హత్య చోటుచేసుకుంది. మరిది రోకలి బండతో వదినను కొట్టి చంపాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగావతి(30) మూడు నెలల క్రితం తన భర్త అహొబిలాన్ని ప్రియుడితో కలిసి హత్య చేయించింది. ఇటీవలే సబ్ జైలుకి వెళ్లి వచ్చిన ఆమె గ్రామంలోనే నివాసం ఉంటోంది.

తన అన్నను చంపించినందుకు కక్ష పెంచుకున్న మరిది పెద్దయ్య.. ఆదివారం అర్ధరాత్రి ఆమె ఇంట్లోకి వెళ్లి రోకలి బండతో కొట్టి చంపేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# విజయవాడలో మరిన్ని జాతీయ పోటీలకు కృషి: ఎంపీ శివనాథ్



విజయవాడ, డిసెంబర్ 22: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ ప్రారంభమైంది. ఈరోజు (సోమవారం) చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. నేటి నుంచి ఈనెల 28 వరకు యోనెక్స్ సన్రైజ్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లు నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విజయవాడలో జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లు జరగడం గర్వకారణమన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం జాతీయ-అంతర్జాతీయ పోటీలకు అనుకూలంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆధునీకరణ చేశామన్నారు. యోనెక్స్ సన్రైజ్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లు యువ క్రీడాకారులకు మంచి వేదిక అని చెప్పుకొచ్చారు. పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ వంటి స్టార్ షట్లర్ల పాల్గొనడం యువతకు ప్రేరణ అని తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ పోటీలను విజయవాడకు తీసుకురావడానికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. కాగా.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శాప్ చైర్మన్ రవి నాయుడు, స్వఛరేంద్రా కార్పొరేషన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ప్లేయర్ పి.వి.సింధు పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చూపులతోనే హృదయాలు దోచుకుంటున్న అనుపమ!

అనుపమ పరమేశ్వరన్ ఈ మధ్యకాలంలో ఏం చేసినా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే నిలుస్తోంది. టిల్లు స్క్వేర్ మూవీతో తన రూట్ మార్చిన ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్స్, వరుస సినిమాలతో ఊపు మీద ఉంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్స్టా ఫోటోలతో మరోసారి స్పెషల్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. తాజాగా ఎల్లో కలర్ క్రాప్ టాప్ లో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో గోల్డెన్ కలర్ టాప్ ఎల్లో కలర్ బాటమ్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. స్లీవ్ లెస్ గోల్డెన్ కలర్ టాప్ లో తళుక్కుమని మెరిసిపోతుంది.. అంతేకాదు చెవులకు పెద్ద చెవి దుద్దులను పెట్టి తన లుక్ లో చెవి దుద్దులనే హైలెట్ చేసింది. రింగుల జుట్టుతో మత్తెక్కించే కళ్ళతో ఉన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఈ హాట్ ఫోటోలను చూస్తే ఎవరైనా సరే అనుపమ అందానికి ఫిదా అవ్వాల్సిందే. అలా ఫోటోలతో కుర్రకారు గుండెల్లో మంట పెట్టిన అనుపమ పరమేశ్వరన్ ఇలాంటి ఫోటోల వల్లే సోషల్ మీడియాలో మరింత ఫేమస్ అవుతుంది. ముఖ్యంగా ఈ హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సాంప్రదాయమైన లుక్ తో అందరినీ కట్టిపడేసింది. కానీ రాను రాను అందరిలాగే ఈ హీరోయిన్ కూడా



తయారైంది అనేలా కొన్ని విమర్శలు ఎదుర్కొంది. ఎందుకంటే సినిమాల్లోకి వచ్చినా కొత్తలో అనుపమ పరమేశ్వరన్ ఒక్క సినిమాలో కూడా బోల్డ్ పాత్రలో నటించలేదు. పొట్టి బట్టలు వేసుకోలేదు. కానీ రౌడీ బాయ్స్ సినిమాతో రూట్ మార్చేసింది. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా నటించడంతోపాటు రొమాంటిక్ సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. దాంతో ఈ హీరోయిన్ ని ఇలాంటి పాత్రలో కూడా తీసుకోవచ్చని దర్శక నిర్మాతలకు ఓ క్లారిటీ వచ్చింది. డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ గా వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం పూర్తి బోల్డ్ గా కనిపించింది. పొట్టి పొట్టి బట్టలు వేయడంతో పాటు లిప్ లాక్ లతో రెచ్చిపోయి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే అప్పటివరకు ఈ హీరోయిన్ ని అభిమానించిన అభిమానులు కూడా ఇదేంటి ఈ హీరోయిన్ ఇలా మారిపోయింది అని నోరెళ్లబెట్టి టిల్లు స్క్వేర్ సినిమాలో ఆమె పర్ఫామెన్స్ ను చూసి షాక్ అయిపోయారు. అయితే అలాంటి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ సినిమా తర్వాత బోల్డ్ పాత్రలకు కూడా ఓకే చెప్పి మరిన్ని అవకాశాలు అందుకుంటుంది. అలా ఈ హీరోయిన్ టిల్లు స్క్వేర్ మూవీ తర్వాత పరదా అనే లేడీ ఓరియంటెడ్ మూవీ తో వచ్చింది. పరదా అనే డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్న మూవీని ఎంచుకొని సమాజంలో ఆడవాళ్లు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఈ సినిమాలో చూపించగా.. అందులో అద్భుతంగా నటించింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు. ఆ తర్వాత వెంటనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కిష్కింధపురి అనే మూవీ తో వచ్చి దెయ్యం పాత్రలో అందర్నీ భయపెట్టేసింది. అలా వరుస సినిమాలు చేస్తూ సౌత్ ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉంటున్న ఈ హీరోయిన్ చేతిలో ప్రస్తుతం ఎల్ క్లాసికో, ది పెట్ డిటెక్టివ్ అనే మలయాళ సినిమాలతో పాటు తెలుగులో భోగి, తమిళంలో బైసన్ అనే సినిమాలు ఉన్నాయి.

## అంతా కోల్పోయినా ఇంకా ఆశతో తూనీగ రియా చక్రవర్తి

బాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంతో ముడిపడిన అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె కుటుంబం బయటపడిన సంగతి తెలిసిందే. సుశాంత్ సింగ్ మరణానంతరం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), ఈడీ, సిట్ సహా పలు దర్యాప్తు సంస్థలు అప్పటి ప్రియురాలు రియా చక్రవర్తి, ఆమె సోదరుడు సోవిక్ చక్రవర్తిని అరెస్ట్ చేసి విచారించాయి. కానీ అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె సోదరుడు నిరపరాధులుగా బయటపడ్డారు. మీడియాలో చాలా కథనాలు రియా చక్రవర్తిని దోషిగా ప్రకటించగా, దానిపై ఇప్పటికీ రియా సెటైర్లు వేస్తూనే ఉంది. ఒక నేరంపై విచారణ తేలక ముందే సోషల్ మీడియాలు రియా చక్రవర్తిని అపరాధిని చేసాయి. అయితే ఈ కేసులో నాలుగేళ్ల పోరాటం ఫలించి చివరికి నిరపరాధిగా నిరూపించుకుని రియా బయటపడింది. అయితే



రియా చక్రవర్తి అన్ని కేసుల నుంచి బయటపడిన తర్వాత కూడా తన వద్ద నుంచి లాక్కున్న పాస్ పోర్ట్ ని తిరిగి ఇవ్వకపోవడం ఆశ్చర్యపరిచింది. ఎట్టకేలకు సంబంధిత అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చింది. రియా చక్రవర్తి చేతికి పాస్ పోర్ట్ అందిందని తెలుస్తోంది. ఇకపై రియా స్వేచ్ఛగా తూనీగలా విదేశాలకు కూడా ఎగిరిపోవచ్చు. అన్ని బంధనాలను తెంచుకుని తాను ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానని రియా ఆనందం వ్యక్తం చేసింది. ఐదు సంవత్సరాలు ఎంతో ఓపిగ్గా ఉన్నాను. ఓపిక నా నిజమైన పాస్ పోర్ట్ అని రియా చక్రవర్తి వ్యాఖ్యానించింది. ఐదేళ్ల క్రితం రియా చక్రవర్తి నటించిన చిత్రం చెహ్రే. ప్రస్తుతం రియా తదుపరి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆమె తన కెరీర్‌ను తిరిగి ప్రారంభించడానికి ఉత్సాహంగా వేచి చూస్తోంది. అయితే నిరపరాధి అని నిరూపించుకున్న తర్వాత కూడా దర్శకనిర్మాతలు ఈ భామకు అవకాశాలివ్వడానికి సిద్ధంగా ఉన్నారా? అంటే ఈ ప్రశ్నకు ఇంకా సమాధానం లేదు. అంతా కోల్పోయినా కానీ ఇంకా ఆశతో ఉన్నానని రియా చక్రవర్తి చెబుతోంది. ఈ భామ ఎం.ఎస్.రాజు దర్శకత్వం వహించిన తూనీగ తూనీగ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే.




## సినిమా ఉన్నా లేకున్నా... మహేష్ సీక్రెట్ ఇదేనట!



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల జరిగిన గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ లో మహేష్ బాబు లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహేష్ బాబు ఎప్పుడు బయట కనిపించినా, మీడియాలో కనిపించినా అభిమానులతో పాటు అందరూ సర్‌ప్రైజ్ అవుతారు. మహేష్ బాబు వయసు చెబితే చాలా మంది ఆశ్చర్యపోతారు. ఆయన అయిదు పదుల వయసు దాటిన ఇప్పటి మూడు పదుల వయసు ముందు ఉన్నట్లుగానే అనిపిస్తూ ఉంటాడు. ఆయన లుక్ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు అని అంటారు. కానీ ఆయన ఫిజిక్ పరంగా ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు అని ఆయన పర్సనల్ ఫిట్‌నెస్ కోచ్ కుమార్ మన్నావా అంటున్నారు. ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి చెప్పిన విషయాలు వైరల్ అవుతున్నాయి.

**వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్...** వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబును చూసిన చాలా మంది ఖచ్చితంగా నోరు వెళ్లబెట్టి ఉంటారు. గుంటూరు కారం తర్వాత మహేష్ బాబు పెద్దగా బయట కనిపించలేదు. దాదాపు రెండేళ్ల తర్వాత మహేష్ బాబును ఒక ఫుల్ ఈవెంట్‌లో చూడటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కాస్త ఎక్కువ గ్యాప్ రావడం వల్లనో లేదంటే మహేష్ బాబు లుక్ మారిందో కానీ ఆయన మరింత ఆకర్షణీయంగా తయారు అయ్యాడు అంటూ అభిమానులతో పాటు అంతా కూడా తెగ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్ గురించి తెగ చర్చ జరిగింది. ఆయన ఆయన ధరించిన ఔట్ ఫిట్ మొదలుకుని, హెయిర్ స్టైల్, వాకింగ్ స్టైల్ వరకు అన్ని విషయాల గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. ఇలాంటి సమయంలో కుమార్ మన్నావా ఇంటర్వ్యూ మరింతగా చర్చనీయాంశం అయింది.

**ఫిజికల్ ఫిట్‌నెస్ విషయంలో మహేష్ బాబు తర్వాతే...** మహేష్ ఫిట్‌నెస్ రహస్యం గురించి కుమార్ మన్నావా మాట్లాడుతూ... మహేష్ బాబు ఒక సినిమాలోని పాత్ర కోసం లేదా, ఏదైనా సినిమాలోని యాక్షన్ సీన్స్ కోసం ఫిజికల్ ఫిట్ నెస్ సాధించాలి అనుకోరు. ఆయన సినిమాలు ఉన్నా లేకున్నా, షూటింగ్ ఉన్నా లేకున్నా, నెలల తరబడి కెమెరాకు దూరంగా ఉండాల్సి ఉన్నప్పటికీ వర్కౌట్స్ మాత్రం ఆపరు. దేశంలో ఉన్నా, విదేశాల్లో ఉన్నా, షూటింగ్ లో ఉన్న, హాలీడేస్ లో ఉన్నా ఏడాదిలో 365 రోజులు ఆయన ఏదో ఒక సమయంలో వర్కౌట్స్ చేయడం జరుగుతూనే ఉంటుంది. ఆయన ప్రతి రోజు వర్కౌట్స్ చేయడం ఒక ఎత్తు అయితే, ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఆయన తినాలి అనుకున్నవి మాత్రమే తింటాడు, ఆయన దూరంగా ఉంచాలి అనుకున్న ఫుడ్ ను ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోరు. అందుకే ఆయన ఇప్పటికీ చాలా యంగ్ గా, ఫిజిక్ పరంగా కుర్రాడిలా ఉంటాడు అన్నట్లుగా చెప్పుకొచ్చాడు.

**రాజమౌళి దర్శకత్వంలో వారణాసి...** టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా సినిమా పదేళ్ల క్రితమే రావాల్సి ఉన్నా ఇద్దరి కమిట్‌మెంట్స్ వల్ల, సరైన కథ సెట్ కాకపోవడం వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇప్పుడు వీరి కాంబో సెట్ అయింది. రాజమౌళికి పాన్ ఇండియా రేంజ్ లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఆయన ఆర్ఆర్ఆర్ సినిమా ఏకంగా ఆస్కార్ వరకు వెళ్లింది. అంతే కాకుండా విదేశాల్లో జక్కన్న దర్శకత్వంలో వచ్చిన బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలు ఇంకా ఇతర సినిమాలు విడుదల అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే జక్కన్న దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా వారణాసి సినిమా ఏ స్థాయికి వెళ్లి ఆగుతుందో ఏ ఒక్కరూ కనీసం ఊహించను కూడా ఊహించలేక పోతున్నారు. వెయ్యి కోట్లు, రెండు వేల కోట్లు అని కాకుండా మరో రేంజ్ లో ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

కచ్చితంగా అభిమానుల అంచనాలను జక్కన్న అందుకుంటాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పార్ట్ -3 లో మోస్ట్ వాంటెడ్ చిత్రాలివే!









ఫ్రాంచైజీలు, సినిమాటిక్ యూనివర్శ్ లు, సీక్వెల్స్ అంటూ సౌత్ ఇండస్ట్రీలో ఒకటే జోరు కనిపిస్తోంది. ఫ్రాంచైజీల విషయంలో బాలీవుడ్ నే మించిపోయేలా కనిపిస్తోంది టాలీవుడ్. వరుస విజయాలతో ఫ్రాంచైజీలతో అంతకంతకు హైప్ తీసుకు రావడం సౌత్ కే చెల్లిందా? అనిపిస్తుంది. అలాంటి ఫ్రాంచైజీస్ లో మోస్ట్ వాంటెడ్ గా మారిన మూడు ఫ్రాంచైజీలు ఇవి. పుష్ప, కాంతార, కేజీఎఫ్, కార్తికేయ. పుష్ప నుంచి ఇప్పటికే ది రైజ్ ..ది రూల్ అంటూ రెండు భాగాలు రిలీజ్ అయి పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసాయో చెప్పాల్సిన పనిలేదు.

**హిట్ ఫ్రాంచైజీల నుంచి పార్ట్ –3...** ఇప్పుడిదే ఫ్రాంచైజీ నుంచి పుష్ప3 ని కూడా దర్శకుడు సుకుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అదెప్పుడు ఉంటుందో తెలియదు కానీ కచ్చితంగా ఉంటుందని మాత్రం వెల్లడించారు. అలాగే కన్నడ నుంచి రిలీజ్ అయిన కేజీఎఫ్ రెండు భాగాలు పాన్ ఇండియాలో అంతే సంచలనమయ్యాయి. ఈ నేపథ్యంలో కేజీఎఫ్ 3 కూడా ఉం టుందని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రకటించాడు. అదెప్పుడు పట్టాలెక్కిస్తారు అన్నది మాత్రం క్లారిటీ లేదు. కానీ ఈసారి మాత్రం సీ బ్యాక్ డ్రాప్ లో కథ సాగుతుందన్నది వాస్తవం. అలాగే కార్తికేయ 2తో దర్శకుడు చందు మొండేటి పాన్ ఇండియా వరల్డ్ లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

**కొత్త అప్ డేట్స్ పై అప్పుడే ఆసక్తి:** ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా హిందుత్వం కాన్సెప్ట్ తో పాన్ ఇండియాకి కనెక్ట్ అయింది. దీంతో కార్తికేయ 3ని ఏకంగా గ్లోబల్ రేంజ్ రీచ్ ఉండేలా చేస్తారనే ప్రకటన వచ్చేసింది. కానీ ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుంది? అన్నది సరైన క్లారిటీ లేదు.

ఖాళీ సమయంలో చందు మొండేటి ఆ స్క్రిప్ట్ వర్క్ లో బిజీ అవు తున్నాడు. అలాగే మరో కన్నడ ఫ్రాంచైజీ కాంతార ఎంత పెద్ద సక్సెస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన కాంతార అనూహ్య విజయం అనంతరం రీసెంట్ రిలీజ్ కాంతార చాప్టర్ వన్ ఏ రేంజ్లో హిట్ అయిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంతార చాప్టర్ –2ని కూడా ప్రకటించారు.

అయితే ఈ నాలుగు చిత్రాల నుంచి రిలీజ్ అయ్యేది పార్ట్ 3 భాగాలు కావడం విశేషం. పాన్ ఇండియాలో ఈ మూడవ భాగంపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ఎలాంటి కథతో వస్తారు? అందులో పాత్రలు ఎలా ఉండబోతున్నాయి? అన్న ఆసక్తి ఇప్పటి నుంచే మొదలైంది. వీటిపై అప్ డేట్స్ రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత అందంగా!

మృణాల్ ఠాకూర్.. ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన పూర్తి స్థాయి తొలి తెలుగు చిత్రం 'సీతారామం'. ఈ సినిమా కంటే ముందు మహానటి సావిత్రి బయోపిక్ ఆధారంగా వచ్చిన 'మహానటి' సినిమాలో జెమినీ గణేషన్ పాత్ర పోషించిన ఈయన.. ఆ తర్వాత సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమా ద్వారానే తెలుగు ప్రేక్షకులను పలకరించింది మృణాల్ ఠాకూర్. ఇందులో సాంప్రదాయంగా చీరకట్టులో కనిపించి, సీత పాత్రతో అందరి హృదయాలను దోచుకుంది. ఇందులో ఆమె చీరకట్టు బొట్టు అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు సినీ ప్రేక్షకులు కూడా ఈమెను సొంత అమ్మాయిగా ఓన్ చేసేసుకున్నారు. అంతేకాదు



పలు చిత్రాలలో అవకాశాలు ఇవ్వాలని అభిమానులు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా సీతారామం విజయం సాధించడంతో నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో జోష్ణ పాత్రతో మరొకసారి పలకరించింది. ఈ సినిమాతో కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ తో కలిసి 'ది ఫ్యామిలీ స్టార్' సినిమా చేసింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందించలేదు. ఇప్పుడు అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసిన మృణాల్ త్వరలోనే ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా ఉండగా తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను, ఫాలోవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి .

అందులో బ్లాక్ ఔట్ఫిట్ లో కనిపించిన ఈమె తన అందంతో అబ్బురపరిచింది. విషయంలోకి వెళ్తే.. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లో జరి గిన బ్వాగారి సెర్పెంటి ఇన్ఫినిటీ ఎగ్జిబిషన్ కి టాలీవుడ్ బాలీవుడ్ అని తేడా లేకుండా చాలామంది నటీమణులు తమ ఫ్యాషన్స్ సెన్స్ తో సందడి చేశారు. అందులో భాగంగానే హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కూడా హాజరయ్యింది. ఇందులో మృణాల్ ఠాకూర్ ఎగ్జిబిషన్లో లీనమై ఆర్ట్ ఇన్స్టాలేషన్ మధ్య అద్భుతమైన నల్లటి ఔట్ఫిట్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది.

## రుక్మిణికి ఆ హీరో లవ్ స్టోరీస్ ఇష్టమట..!

కన్నడ భామ రుక్మిణి వసంత్ ప్రస్తుతం సోషల్ మీడియా ట్రెండింగ్ లో ఉంటుంది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఆడియన్స్ మనసులు గెలిచిన ఈ అమ్మడు రీసెంట్ గా రిలీజైన కాంతారా చాప్టర్ 1 లో అదరగొట్టేసింది.

సినిమాలో కనకావతి రోల్ లో రుక్మిణి తనకు వచ్చిన అవకాశాన్ని పర్ఫెక్ట్ గా యూజ్ చేసుకుంది. కాంతారా 1 తో అమ్మడు మరింత క్రేజ్ సంపాదించుకుంది. సినిమాలో ఆమె క్లిప్స్ ని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు రుక్మిణి వసంత్ ఫ్యాన్స్.

**ఎన్టీఆర్ డ్రాగన్ లో రుక్మిణి..** స్టార్ హీరోయిన్ క్వాలిటీస్ అన్నీ ఉన్న రుక్మిణి తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది. నెక్స్ట్ ఎన్టీఆర్ డ్రాగన్ లో అమ్మడు నటిస్తుంది. రుక్మిణి ఇప్పటికే తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. విజయ్ సేతుపతితో ఏస్,



శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాల్లో నటించింది అమ్మడు. ఐతే రుక్మిణి తన ఇంటర్వ్యూస్ లో ఎప్పుడు తనకు ఇష్టమైన హీరో ఎవరంటే ఆమె తమిళ స్టార్ సూర్య పేరు చెబుతూ వచ్చింది. సూర్య సార్ అంటే చాలా ఇష్టం. ఆయన చేసిన లవ్ స్టోరీస్ చాలా ఇష్టమంటుంది అమ్మడు. రుక్మిణి అలా చెబుతున్న క్లిప్స్ ని సూర్య ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. ఎలాగు అమ్మడికి మంచి ఫాలోయిన్ వచ్చింది కాబట్టి ఆమెకు ఇష్టమైన హీరో సూర్యతో జత కట్టే ఛాన్స్ ఇస్తే బెటర్ అని అంటున్నారు. రుక్మిణి వసంత్ కూడా సూర్య తో నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్టు ఉంది.

**ఆడియన్స్ అంతా ఆమె మాయలో..** ఇక తెలుగులో రుక్మిణికి చరణ్ అంటే ఇష్టమని చెప్పింది. సో ఇటు ఎన్ టీ ఆర్ తర్వాత అమ్మడు చరణ్ తో కూడా నటించే ఛాన్స్ లు ఉన్నాయి. ఏది ఏమైనా రుక్మిణి వసంత్ ప్రస్తుతం నేషనల్ ఆడియన్స్ అంతా తన మాయలో పడి ఊగిపోతున్నారు. తప్పకుండా అమ్మడికి ఇంకా చాలా మంది అవకాశాలు వచ్చి పాన్ ఇండియా లెవెల్ లో అద్భుతాలు చేసేలా ఉందని చెప్పొచ్చు. కాంతారా 1లో తన రోల్ కి పూర్తిస్థాయిలో న్యాయం చేసిన రుక్మిణి కోసం మరిన్ని ఛాలెంజింగ్ రోల్స్ రాసేందుకు అవకాశం ఇస్తుంది. అంతేకాదు లవ్ స్టోరీస్, కమర్షియల్ సినిమాల్లో నటించడం కూడా ఇష్టమని అంటుంది అమ్మడు. సౌత్ నుంచి నేషనల్ క్రష్ గా మారింది కన్నడ భామ రష్మిక మందన్న. ఐతే ప్రస్తుతం ఆమె వరుస సినిమాలతో బిజీ అయ్యింది. ఐతే రష్మిక తర్వాత నేషనల్ క్రష్ ట్యాగ్ ని రుక్మిణికి ఇచ్చేయాలని కొత్త నేషనల్ క్రష్ రుక్మిణి వసంత్ అని సోషల్ మీడియాలో ఒకటే హడావిడి జరుగుతుంది.



# రాష్ట్రపతిని మేడారం మహాజాతరకు ఆహ్వానించిన రాష్ట్ర మంత్రులు

ములుగు : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరిందిన శ్రీ మేడారం సమ్మక్క సారమ్మ మహాజాతర వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నదని, ఈ జాతరకు రాష్ట్రపతి హోదాలో అమ్మవార్లను దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, అట్లూరు లక్ష్మణ్ కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతికి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం మహాజాతర సంప్రదాయాలకు అనుగుణంగా, సమ్మక్క తల్లి చీర, కంకణం, కండువా బంగారాన్ని రాష్ట్రపతికి అందచేశారు. అనంతరం మంత్రి సీతక్క మేడారం జాతర ఘనత, ఆదివాసీ సంస్కృతిలో దాని అపూర్వ స్థానం, సమ్మక్క సారలమ్మ తల్లుల పోరాట చరిత్ర, వారి త్యాగం, ప్రజల విశ్వాసం, భక్తి, మేడారం అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్రపతి వివరించారు. మేడారం జాతర విశేషాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అత్యంత ఆసక్తితో విని, ఈ మహా జాతరకు హాజరయ్యేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని తెలిపారు. రాష్ట్రపతి మంత్రులకు ఆప్యాయంగా నూతన వస్త్రాలను బహూకరించి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని రాష్ట్రపతి అభినందించారు.

# కొత్త పెట్టుబడులతో 1.40 లక్షల మందికి ఉద్యోగావకాశాలు: శ్రీధర్‌బాబు



హైదరాబాద్: నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బీఆర్ఎస్ నాయకత్వం కోరుకుంటోందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. గ్లోబల్ సమిట్ వేదికగా రూ.లక్ష కోట్ల ఎంవోయూలు కుదిరాయని, వాటిని కేసీఆర్ చాలా తక్కువ చేస్తూ మాట్లాడారని అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి సూచనలు చేస్తారనుకుంటే.. కేసీఆర్ పెట్టుబడులు రావొద్దన్నట్లు మాట్లాడారని దుయ్యబట్టారు. " ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థ ఇక్కడే పరిశ్రమ పెట్టేలా ప్రయత్నం చేస్తుంటాం. బీఆర్ఎస్ హయాంలోనూ ఒప్పందం చేసుకున్న ప్రతి పరిశ్రమ రాలేదు. దానిపై మేం రాజకీయాలు చేయలేదు.

ఇప్పటికే ఏ రాష్ట్రంలో లేనంతగా పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టించాం. హైదరాబాద్‌కు వచ్చేందుకు ఎన్నో అంతర్జాతీయ వర్సిటీలు సిద్ధంగా ఉన్నాయి. ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను తీసుకొచ్చాం. అత్యధిక జీసీసీలు వచ్చిన రాష్ట్రంలో తెలంగాణ నిలిచింది. గతేడాది రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. కొత్త పెట్టుబడులతో 1.40 లక్షల మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు రానున్నాయి. హైదరాబాద్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రపంచ అవసరాల్లో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయి" అని శ్రీధర్‌బాబు అన్నారు.

# రాచకొండ పరిధిలో పెరిగిన నేరాలు.. వార్షిక నివేదిక వివరాలివే

హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. 2024లో 28,626 కేసులు నమోదు కాగా.. 2025లో ఈ సంఖ్య 33,040కు పెరిగింది. మహిళలపైనా గత ఏడాదితో పోలిస్తే 4 శాతం అధికంగా నేరాలు నమోదయ్యాయి. "కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను (78 శాతం) పరిష్కరించాం. 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడేలా దర్యాప్తు చేశాం. అడ్డగూడూరు పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేశాం. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశాం. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేశాం. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసి.. రూ.20 కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాం. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచాం. నాన్‌బెయిలబుల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండను తీర్చిదిద్దాం" అని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.

**వార్షిక నేర గణాంకాలు..** 579 కిడ్నాప్ కేసులు, 1224 పోక్సో కేసులు. దోపిడి కేసులు 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీలు 589. వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1,161. హత్యలు 73, అత్యాచారాలు 330. వరకట్నం మరణాలు 12, గృహ హింస కేసులు 782.




జైపూర్, మందమర్రి పట్టణం: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం ఎక్స్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం సంభవించింది. బొలెరో వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి 23 మంది కూలీలు వరి నాట్లు వేసేందుకు బొలెరో వాహనంలో కరీంనగర్‌కు వెళ్తున్నారు.

ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. మరో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దు: హరీశ్‌రావు

హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాల కోసం కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. "బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అదుతే ఆర్థిక ప్రగతి సాధించింది. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా కేసీఆర్ నిలిపారు. మూడురెట్ల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగింది. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ ఆరోపించారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని కోరుతున్నా. సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ పెరిగినట్లు ఆయన స్వయంగా చెప్పారు. రూ.50కోట్లు పెట్టి రేవంత్ పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి చెప్పారు. నిజాయతీగా, త్యాగాల పునాదులపై ఎదిగిన నాయకత్వం మాది. ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచల్లా త్యాగాలు చేసిన చరిత్ర మా పార్టీ నేతలది" అని హరీశ్‌రావు అన్నారు.






హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఇకపై అద్దె భవనాల్లో ప్రభుత్వ ఆఫీసులను నిర్వహించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు డిసెంబర్ 31 లోపు రెంటెడ్ బిల్డింగులలో నిర్వహిస్తున్న అన్ని శాఖల ప్రభుత్వ ఆఫీసులను ఖాళీ చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఆఫీసులన్నీ విజయవాడకు వెళ్లి పోగా ఆఫీసులను ఏర్పాటు చేసుకునేందుకు హైదరాబాద్ సిటీలో అవసరమైన వసతులున్నాయని తెలిపింది.

డిసెంబర్ 31 లోగా అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులు, సీఎస్ లు కార్యదర్శులు, డిపార్టుమెంట్ల ఉన్నతాధికారులు ఆఫీసుల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించి తక్షణమే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది ఆర్థిక శాఖ. జనవరి 1 నుంచి ఖచ్చితంగా ప్రభుత్వ భవనాల్లోనే ఆఫీసులు కొనసాగాలని స్పష్టం చేసింది. మరోవైపు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆఫీసులకు సంబంధించిన అద్దెను ఫిబ్రవరి 1 నుంచి నిలిపివేయాలని ట్రెజరరీ విభాగానికి కూడా సర్క్యులర్ జారీ చేసింది. ప్రభుత్వం తన ఆఫీసులకు వసతి కల్పించే ప్రైవేట్ భవనాల అద్దె పేరుతో ఏటా భారీ మొత్తాలను చెల్లించాల్సి వస్తుంది .. ఈ అద్దెలను తగ్గిస్తే ఖజానాకు భారీ మొత్తం ఆదా అవుతుంది. విభజన తర్వాత గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తన కార్యాలయాలను ఖాళీ చేసినప్పటి నుంచి హైదరాబాద్ నగరంలో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించుకోవాలని సర్క్యులర్ లో తెలిపింది.

ఏపీ ఆఫీసులు విజయవాడకు వెళ్లిపోవడంతో పరిశ్రమ్ భవన్, గగన్ విహార్ కాంప్లెక్స్, బీఆర్కే భవన్ ఎర్రమ్ మంజిల్ వంటి భవనాలు తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చాయి. ఇప్పుడు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆఫీసులను తరలించేందుకు అనుకూలంగా ఉన్నాయి. ఆయా డిపార్టుమెంట్ల అధిపతులు స్థలాలను పరిశీలించి తమ ఆఫీసులను తరలించే ఏర్పాటు చేసుకోవాలని తెలిపింది.




హైదరాబాద్: రెండేళ్ల తర్వాత అధికారంలోకి రాగానే తోలు తీస్తానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెబుతున్నారని.. ఆ పార్టీకి కండలు కరిగిపోయి తోలు మాత్రమే మిగిలిఉందని తెలంగాణ మంత్రి జూపల్లి కృషారావు అన్నారు. బీఆర్ఎస్ బలహీనపడిందని.. పార్టీ ప్రతిష' కాపాడుకోవాలనే విషయం కేసీఆర్‌కు అర్థమైందని చెప్పారు. గాంధీభవన్‌లో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి జూపల్లి మీడియాతో మాట్లాడారు. "పాలమూరు ప్రాజెక్టు సమస్య గురించి కాదు.. పార్టీ ప్రతిష'ను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ బయటకు వచ్చారు. ఆ ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకుని పూర్తిచేస్తానని గతంలో ఆయన చెప్పారు. పదేళ్లు పాలించి.. రూ.8 లక్షల కోట్ల అప్పు చేసినా ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన కాలువలు కూడా పూర్తిచేయలేదు. 2023 ఎన్నికల సమయంలో ఒక మోటార్ ఆన్‌చేసి పాలమూరు ప్రాజెక్టు జాతికి అంకితమన్నారు. నీటి కేటాయింపులు, అనుమతులు లేకుండా ఆ పని చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.40-రూ.50వేల కోట్లు కావాలి. పర్యావరణ అనుమతులు తీసుకుంటే మన నీళ్లు మనం వాడుకునే పరిస్థితి ఉంటుంది. సాగుకు కాదు.. తాగునీటి కోసమని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పనులు మొదలుపెట్టవచ్చని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇరు రాష్ట్రాలకు కలిపి 811 టీఎంసీలు అని విభజన చట్టంలో ఉంది. నదీ పరివాహక ప్రాంతం ఉన్నంత మేరకు నీటి కేటాయింపులు జరగాలి. రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలు.. 512 టీఎంసీలు ఏపీ వాడుకోవాలని పదేళ్లు వదిలేశారు" అని జూపల్లి విమర్శించారు.

**ఆ రెండు పార్టీలు కలిసి పనిచేశాయి...** పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్, భాజపా కలిసి పనిచేశాయని జూపల్లి కృషా?రావు అన్నారు. ఆ రెండు పార్టీలు కలిసినా మూడింట ఒక వంతు సీట్లు కూడా వారికి రాలేదని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని ఇటీవల కేటీఆర్ చెప్పారని గుర్తుచేశారు. ప్రభుత్వంపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపణలు తప్పు అని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. రివ్యూ కమిటీలో ఉన్నవారిని మరోసారి విచారించిన సిట్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రివ్యూ కమిటీలో ఉన్న వారిని సిట్ మరోసారి విచారించింది. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రెటరీ, సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను మరోసారి ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, ఐపీఎస్ అధికారి నవీన్ చంద్‌కు సైతం నోటీసులు ఇచ్చి సిట్ విచారించింది. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్ ఎదుట ప్రభాకర్‌రావును ఉంచి వివరాలడిగింది. రెండోసారి నవీన్ వద్దకు వెళ్లి ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి, అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ స్టేట్‌మెంట్ కూడా మరోసారి రికార్డు చేసిన సిట్.. ఈ కేసులో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు..




హైదరాబాద్, డిసెంబర్ 22: నగరంలోని శంషాబాద్ విమానాశ్రయంలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. బాంబు బెదిరింపుల సమాచారం రావడంతో.. నెదర్లాండ్ వెళ్లే ఓ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయించారు అధికారులు. నెదర్లాండ్ విమానంలో బాంబు పెట్టినట్టు ఓ ఆగంతకుడి నుంచి ఎయిర్‌పోర్ట్ అధికారులకు మెయిల్ వచ్చింది. దీంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సదరు ఫ్లైట్‌ను అత్యవసర ల్యాండింగ్ చేసి.. విమానం మొత్తం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే.. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు 20కి పైగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

# ఇదెక్కడి చలిరా బాబోయ్..!

## సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీలు - 15 జిల్లాల్లో 10.1 డిగ్రీల్లోపే..

హైదరాబాద్: రాష్ట్రంలో దాదాపు రెండు వారాలుగా చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. ఇదెక్కడి చలిరా బాబోయ్.. అస్సలు తగ్గట్లేదనుకుంటూ ప్రజలు గజగజా వణికిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.9 డిగ్రీలుంది. 15 జిల్లాల్లో 10.1 డిగ్రీల సెల్సియస్‌లోపే నమోదయ్యాయి. వికారాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. రాష్ట్రంలో సోమ, మంగళ, బుధవారాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, ములుగు, మంచిర్యాల జిల్లాల్లో 8 డిగ్రీల్లోపు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com